
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 9 జనవరి 2025





విజ్ఞాన ఉత్సవం

పుస్తక మహోత్సవంలో రచయితల పుస్తకాలు, కవితా సంపుటిల ఆవిష్కరణ

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవం బుధవారం పుస్తక ప్రియులతో కళకళలాడింది. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, విద్యావేత్తలు తదితరలు భారీగా తరలివచ్చి పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు. రామోజీరావు సాహిత్య వేదికపై ఆకుల అమరయ్య రచించిన 'భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు' పుస్తకం, పి.శ్రీనివాస గౌడ్ రాసిన 'అంబపలుకు' కవితా సంపుటి, వి.రాంభూపాల్ రచించిన 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు, అసమానతలు - ఆర్థిక విధానాలు, విద్వేష రాజకీయాలు' అనే పుస్తకాలను ఆవిష్కరించారు.

6లో

కార్పొరేట్ కళాశాల విద్యార్థిని మృతి

- యాజమాన్యమే కారణమంటున్న తల్లి, బంధువులు
- కుమార్తె మృతి వార్త విని తండ్రికి గుండెపోటు

8లో

అవినీతిలో బాద్‌షా

సాంఘిక సంక్షేమశాఖలో మామూళ్ల కంపు

జీతాల బిల్లులు, నాల్గో తరగతి ఉద్యోగుల పదోన్నతుల్లో భారీగా వసూళ్లు!



"ఆయన సాంఘిక సంక్షేమశాఖలో బాద్'షా'. ఆయన చెప్పిందే వేదం. కాదు కూడదు అన్నారా ఇక అంతే.. వారి పని అయిపోయినట్లే. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయిస్తారు. అది చెల్లిస్తేనే జీతాల బిల్లులు అయ్యేది.. నాల్గో తరగతి ఉద్యోగుల పదోన్నతుల ఫైల్ ముందుకు కదిలేది. ఇక్కడి ఉద్యోగులనే ఇంటి పనులకు వినియోగించుకుంటారు. చెయ్యలేమంటే వారిని దూర ప్రాంతాలకు బదిలీ చేస్తారు. ఆ తర్వాత జీతాలు అందకుండా కక్ష సాధింపులకు దిగుతారు. ఈయన చర్యలతో జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ ఉద్యోగులు, అధికారులు హడలిపోతున్నారు. వసతి గృహాల్లోని పేద పిల్లల మెనూలో కోత విధించి మరీ ఈయన అవినీతి పొట్ట నింపాల్సి వస్తోందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు."

- మాట వినకపోతే దూర ప్రాంతాలకు బదిలీ.. ఆపై జీతాలు రాకుండా కక్ష సాధింపు
- నలుగురు వార్డెన్‌లను ఖాళీగా కూర్చోబెట్టి నెలనెలా జీతాలు
- ఇంటి వద్ద పనులకూ ఇక్కడి ఉద్యోగులే.. కాదంటే బెదిరింపులు
- సాంఘిక సంక్షేమశాఖ కీలక అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. విజయవాడకు సమీపంలో నివాసం ఉండే ఈ శాఖ ముఖ్య అధికారి సోమవారం మినహా మిగిలిన రోజుల్లో మచిలీ పట్నంలోని కార్యాలయం ముఖం చూడరు. అన్ని పనులు ఇంటి వద్ద నుంచే చక్కపెడతారు. అదేమంటే తనకు ప్రభుత్వంలోని నలుగురైదుగురు ఉన్నతాధికారులు తెలుసు అని, ఇద్దరు.. ముగ్గురు మంత్రులతో పరిచయాలు ఉన్నాయని, తనను ఎవ్వరూ ఏం చేయలేరని కిందస్థాయి ఉద్యోగులు, అధికారులను బెదరగొడుతున్నారు. ఒకవైపు జిల్లాస్థాయి అధికారులు వసతి గృహాల్లో ఉండే పిల్లలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రణాళికలు రూపొందిస్తుంటే, ఈయన మాత్రం నగదు వసూళ్లే లక్ష్యంగా పని చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

వసతి గృహాలు నడుస్తున్నట్లు చూపి జీతాలు

జిల్లాలోని మోపిదేవి, మోటూరు, గన్నవరం, ఉయ్యూరులోని వసతి గృహాలు మూతపడ్డాయి. కానీ అక్కడ వసతి గృహాలు నడుస్తున్నట్లుగా చూపి నెలనెలా సంబంధిత వార్డెన్లకు జీతాల బిల్లులను ఈ అధికారి చేస్తుండటం గమనార్హం. పనిలేకుండా ఖాళీగా ఉన్న వార్డెన్లు వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ఈ అధికారి అనుగ్రహంతో నెలనెలా జీతాలు తీసుకుంటున్నారు. ఈ అధికారి తనశాఖతో పాటు మరో సంక్షేమ శాఖకు ఇటీవల కాలంలో కొద్ది నెలలపాటు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆ సమయంలో పోలాటితిప్ప, ఏటిమొగ, సొర్లగొంది, కోడూరు, ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ వసతి గృహాల్లో పనిచేసే క్లాస్-4 ఉద్యోగులకు వార్డెన్‌లుగా పదోన్నతులు ఇచ్చారు. ఈ పదోన్నతుల వ్యవహారంలో ఒక్కొక్కరి నుంచి కనీసంగా రూ.3 లక్షలకు పైగా నగదు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. పదోన్నతులు ఇచ్చే సమయంలో సదరు ఉద్యోగులకు సంబంధించిన విద్యార్హతలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా, జిల్లా అధికారులను ఈ అధికారి తన 'బుద్ధి'బలంతో బురిడీ కొట్టించారనే విమర్శలున్నాయి. ఏడాదిన్నర కిందట జిల్లాలో 15 మంది మిగులు ఉద్యోగులు, వార్డెన్‌లను అమరావతిలోని సచివాలయానికి మిగతా 6లో..

ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల్లో చేతివాటం

ఇటీవల వార్డు, గ్రామ సచివాలయాల్లో ఒక విభాగంలో పనిచేసే ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ బదిలీల వ్యవహారంలోనూ ఈ అధికారి తనదైన శైలిలో అవినీతికి పాల్పడినట్లు సంబంధితశాఖ ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఇటీవల కాలంలో 37 మంది వార్డెన్‌లకు గ్రేడ్-1 వార్డెన్లుగా పదోన్నతులు ఇచ్చారు. ఈ వ్యవహారంలోనూ ఒక్కొక్కరి నుంచి లక్ష రూపాలయ చొప్పున వసూళ్లకు పాల్పడ్డారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే ఉద్యోగులను ఏపీ కాప్‌లో చేర్చాలని ప్రభుత్వం ఇటీవల అనుమతులు ఇచ్చింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏపీ కాప్‌లో చేర్చేందుకు పెద్దమొత్తంలో ఈ అధికారి నగదు వసూలు చేశారనే విమర్శలున్నాయి. సదరు అధికారి పనితీరుపై ఉన్నతాధికారులు విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు బయటకు వస్తాయని ఆశాఖ ఉద్యోగులు అంటున్నారు.

ఇసుక కార్మికుల ఆందోళన ఉద్రిక్తం

తోట్లవల్లూరులో మిషన్ లోడింగ్ నిలిపి వేయాలని ధర్నా

శిబిరం వద్దకు వైసీపీ, టీడీపీ నాయకుల రాకతో ఘర్షణ

టీడీపీ నేత ఈడే వాసుపై పోలీసులు, అధికారుల సమక్షంలో దాడి

వైసీపీ మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ పెద్దల తెరవెనుక జోక్యంతో జఠిలమవుతున్న వివాదం



బుధవారం రాత్రి క్వారీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు

తోట్లవల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరులో ఇసుక కార్మికుల ఆందోళన బుధవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. వైసీపీ, టీడీపీ నాయకుల జోక్యంతో మాటామాట పెరిగి తన్నుకునే వరకు వెళ్లింది. టీడీపీ నేత వాసుపై పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలోనే దాడి జరిగింది. వివరాల్లోకి వెళితే...



తోట్లవల్లూరు రేవు వద్ద ఇసుక లారీని అడ్డుకున్న ఇసుక కార్మికులు

నార్తువల్లూరు ప్రభుత్వ ఇసుక క్వారీలో మిషన్ లోడింగ్ నిలిపివేసి కార్మికులతో లోడింగ్ చేయించి పని కల్పించాలని తోట్లవల్లూరు రేవులో బుధవారం తెల్లవారుజాము నుంచి ఇసుక కార్మికులు ధర్నాకు దిగారు. తెల్లవారు జామున ఆరు గంటలకు నార్తువల్లూరు క్వారీ నుంచి ఇసుక లోడింగ్‌తో వస్తున్న ఒక లారీని తోట్లవల్లూరు రేవులో ఈడ్పుగంటి కోటేశ్వరరావు, ఈడ్పుగంటి చంటి, పాగోలు రాంబాబు, ఈడ్పుగంటి రాజు, మట్టా సోని, బండ్రపల్లి రమేష్ తదితరుల ఆధ్వర్యంలో 40 మంది కార్మికులు అడ్డుకున్నారు. నదీపాయలో రహదారిపై లారీ ఎదుట టెంట్ వేసి ధర్నాకు కూర్చున్నారు. దీంతో సీఐ చిట్టిబాబు, ఎస్సై అర్జున రాజు, సిబ్బందితో వచ్చి చర్చలు జరిపారు. క్వారీ నిర్వాహకులు వచ్చి సమాధానం చెప్పాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఎవరు చర్చలకు రాకపోవడంతో సాయంత్రం 7.30 గంటల వరకు ధర్నా కొనసాగిస్తునే ఉన్నారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పదిమంది కార్మికులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అర్జీ అందించేందుకు ప్రయత్నిస్తే తహసీల్దార్ కుసుమకుమారి నిరాకరించారని కోటేశ్వరరావు చెప్పారు. దాంతో ధర్నా రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగుతూనే ఉంది.

నచ్చజెప్పేందుకు పోలీసుల ప్రయత్నం

మరోవైపు ఏదైనా సమస్య ఉంటే అధికారులకు అర్జీ అందించాలని, లేదా క్వారీ నిర్వాహకులతో చర్చించి పరిష్కరించుకోవాలని, ఇలా వాహనాన్ని అడ్డుకుని ధర్నా చేయటం పద్ధతి కాదని, కేసులు నమోదు చేయాల్సి వస్తుందని మిగతా 6లో..

వాస్తవాలు ఇవీ...

నార్తువల్లూరు ప్రభుత్వ క్వారీ పాములలంక సమీపంలో పెద్దఏటిపాయలో ఉంది. ఇక్కడ నుంచి వల్లూరుపాలెం వద్ద అధికారులు పెట్టిన స్టాక్ పాయింట్ ఏడు కిలో మీటర్ల దూరంలో ఉంది. క్వారీ నిర్వాహకులు టన్ను ఇసుక స్టాక్ పాయింట్‌కు తరలించేందుకు రూ.99లకు టెండర్ తీసుకున్నారు. ట్రాక్టర్‌లో మూడు టన్నుల ఇసుక వల్లూరుపాలెం స్టాక్‌పాయింట్‌కు రవాణా చేస్తే క్వారీ నిర్వాహకులకు రూ.297 వస్తాయి. ఇది తీవ్ర నష్టం కలగజేస్తోందని.. పగలు అరకొరగా ఇసుకను స్టాక్‌పాయింట్‌కు తోలి రాత్రి సమయంలో మిషన్ పెట్టి లారీలకు లోడింగ్ చేస్తున్నారు. దీనిని కార్మికులు తమకు అనుకూలంగా మార్చుకుని లబ్ధి పొందాలనేది అసలు వ్యూహంగా కనిపిస్తోంది. కార్మికులు ఈ క్వారీకి వచ్చి ఇసుక లోడింగ్ చేస్తే రూ.300 చెల్లిస్తారు. దాంతో కార్మికులు రూ.300లకు ఇసుక లోడింగ్ చేసేందుకు ముందుకు రాకుండా తోట్లవల్లూరు పాయలో ఇల్లీగల్ క్వారీ ఏర్పాటు చేసుకుని ట్రాక్టర్ ఇసుకను రూ.800లకు లోడింగ్ చేసి మంచి ఆదాయం పొందుతున్నారు. మిషన్‌తో లోడింగ్ చేసుకుంటున్నందుకు రొయ్యూరులో రోజుకు రూ.40 వేలను క్వారీ నిర్వాహకులు పనిచేయకుండానే కార్మికులకు చెల్లిస్తున్నారు. తమకు కూడా రొయ్యూరు ప్యాకేజీ కావాలని, రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించి మిషన్‌తో ఇసుక లోడింగ్ చేసుకోమని కార్మికుల అంతర్గత డిమాండ్‌గా కొందరు చెబుతున్నారు. ఈ డిమాండ్‌ను అధికారుల ముందు ఉంచకుండా మిషన్ లోడింగ్ ఆపి పనికల్పించాలని కార్మికులు కూర్చోవడంతో ఈ సమస్య తెగకుండా ఉంది.

శరవేగంగా..

విజయవాడ-గుడివాడ, గుడివాడ-మచిలీపట్నం డబ్లింగ్ పూర్తి

- భీమవరం-నరసాపురం-నిడదవోలు మార్గం కూడా..
- కృష్ణాజిల్లా ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనున్న మార్గం
- 221 కిలోమీటర్లు.. రూ.3 వేల కోట్లతో డబ్లింగ్, విద్యుదీకరణ
- 2019లో పట్టాలెక్కిన పనులు.. వేగంగా అందుబాటులోకి..
- విశాఖలో ప్రారంభించి జాతికి అంకితం చేసిన ప్రధాని



"కృష్ణాజిల్లా అభివృద్ధి రైలు పట్టాలెక్కింది. విజయవాడ-గుడివాడ, గుడివాడ-మచిలీపట్నం, గుడివాడ-భీమవరం, భీమవరం-నరసాపురం, నరసాపురం-నిడదవోలు మార్గంలో డబుల్ రైల్‌లైన్ అందుబాటులోకి వచ్చింది. విద్యుదీకరణ పనులు కూడా పూర్తికావడంతో బుధవారం విశాఖపట్నం పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మించిన ఈ సరికొత్త లైన్ అందుబాటులోకి రావడంతో ఉమ్మడి గోదావరి, కృష్ణాజిల్లాల్లో అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ పరిశ్రమకు మంచిరోజులు వచ్చినట్లైంది."

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు విజయవాడ నుంచి మచిలీపట్నం మధ్య రైలు ప్రయాణం చాలా భారంగా సాగేది. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. ఈ మార్గంలో ప్రయాణం వేగవంతంగా సాగేందుకు అన్ని మార్గాలు తెరుచుకున్నాయి. విజయవాడ-గుడివాడ, గుడివాడ-మచిలీపట్నం, గుడివాడ-భీమవరం, భీమవరం-నరసాపురం, నరసాపురం-నిడదవోలు మార్గంలో రైల్వేలైన్‌ను డబుల్ లైనుగా మార్చారు. డబ్లింగ్ పనులతో పాటు విద్యుద్దీకరణ కూడా పూర్తి చేయడంతో ఈ మార్గంలో ప్రయాణం వేగంగా సాగనుంది. ఈ రైలు మార్గాన్ని బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నంలో ప్రారంభించి, జాతికి అంకితం చేశారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం

దక్షిణ మధ్య రైల్వేలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టును మచిలీపట్నం ఎంపీ బాలశౌరి 2019లో పట్టాలెక్కించారు. సుమారు 221 కిలోమీటర్ల మేర డబ్లింగ్, విద్యుదీకరణ పనుల కోసం రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ సుమారు రూ.3 వేల కోట్లను ఖర్చు చేసింది. విజయవాడ, ఉప్పులూరు, ఇందుపల్లి, గుడివాడ, మోటూరు, పెడన, కౌతవరం, మచిలీపట్నం వరకు డబ్లింగ్, విద్యుదీకరణ చేశారు. ఉప్పులూరు-గుడివాడ, గుడివాడ-మచిలీపట్నం నడుమ 69 కిలోమీటర్ల పనులను ఒకే విడతలో పూర్తిచేయడం రైల్వే చరిత్రలోనే అరుదు. ఈ 69 కిలోమీటర్ల డబుల్ లైన్‌ను అత్యాధునిక సాంకేతికతతో నిర్మించారు. 25 టన్నుల యాక్సల్ లోడ్‌ను తట్టుకునేలా ఈ లైన్‌ను నిర్మించారు. ఈ మార్గంలో 110 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించవచ్చు. 60 కేజీల ప్రీ స్ట్రెస్డ్ సిమెంట్ స్లీపర్స్‌ను దీని నిర్మాణంలో ఉపయోగించారు. 11 మేజర్ వంతెనలు, 22 మైనర్ వంతెనలు నిర్మించారు. ఈ మార్గంలోని 24 రైల్వే లెవల్ మిగతా 6లో..

వడ్డీ వ్యాపారి దారుణ హత్య



ఆస్పత్రిలో వడ్డీ వ్యాపారి అడపాల రవికుమార్ మృతదేహం

అర్ధరాత్రి ఇంటి ముందే కత్తులతో పొడిచిన దుండగులు

- తీవ్రంగా గాయపడిన వ్యాపారిని ఆస్పత్రికి తీసుకెళ్లిన బంధువులు
- చికిత్స పొందుతూ కన్నుమూత... కుమార్తె ఫిర్యాదుపై కేసు నమోదు



అడపాల రవికుమార్ (ఫైల్)



హంతకులు వినియోగించిన కత్తి

మచిలీపట్నం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారిని ఇంటి ముందే గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన చిలకలపూడిలో సంచలనం రేకెత్తించింది. చిలకలపూడి సీఐ షేక్ అబ్దుల్ నబి తెలిపిన వివరాల మేరకు.. చిలకలపూడికి చెందిన వడ్డీ వ్యాపారి అడపాల రవికుమార్ (50)ను మంగళవారం అర్ధరాత్రి ముగ్గురు దుండగులు ఇంటి ముందే కత్తులతో బలంగా పొడిచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన రవికుమార్ ఇంటికి దగ్గరలో ఉన్న బంధువు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం ఇంటి తలుపుకొట్టాడు. బయటకు వచ్చిన పంచపర్వాల భరత్‌కుమార్ తీవ్రంగా గాయపడిన రవికుమార్‌ను చూసి బంధువులు, స్నేహితుల సాయంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవికుమార్ మృతి చెందాడు. వారం రోజుల కిందట రేవతీ సెంటర్‌లో కొందరితో రవికుమార్‌కు వాగ్వివాదం జరిగిందని తెలుస్తోంది. వారిలో ఒకరిపై రవికుమార్ చేయి చేసుకున్నట్టు సమాచారం. వారే రవికుమార్ ఇంటికి వచ్చి కత్తులతో పొడిచి హతమార్చి ఉంటారని అనుమానిస్తున్నారు. సీసీ పుటేజీలో రికార్డు అయిన దృశ్యాలను పోలీసులు పరిశీలించారు. దుండగులు ఉపయోగించిన కత్తిని గుర్తించారు. నిందితులు మచిలీపట్నానికి చెందిన వారిగా తెలుస్తోంది. కాగా, రవికుమార్ కుమార్తె ధాత్రినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి సీఐ షేక్ అబ్దుల్ నబి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవ పరీక్ష నిర్వహించారు. పదిహేనేళ్ల కిందట రవికుమార్‌పై బంధువులు దాడి చేసిన ఘటనపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.

పామర్రులో సిద్ధమవుతున్న బరులు

8లో

ఆంధ్రా లయోలా కళాశాలకు నోటీసులు

- నిబంధనల ఉల్లంఘనపై వివరణ కోరిన కృష్ణా వర్సిటీ 8లో

అయ్యప్పను దర్శించకుండానే..

అనంతలోకాలకు

- శబరిమల యాత్రలో విషాదం
- గుండెపోటుతో చల్లపల్లి వాసి మృతి

8లో

ప్రాణాలు తీసిన అతివేగం

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ
- తీవ్రంగా గాయపడిన ఇద్దరు అక్కడికక్కడే మృతి
- మృతులు అయ్యంకి, మల్లవోలు గ్రామస్తులుగా గుర్తింపు





ఘటనా స్థలంలో పడమటి నాగరాజు, పడమటి నాగమునీశ్వరరావు మృతదేహాలు

కూచిపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన లారీ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరి ప్రాణాలు తీసిన ఘటన మొవ్వ మండలం యద్దనపూడి భీమనది పంట కాలువ, అయ్యంకి అడ్డరోడ్డు మధ్యలో బుధవారం రాత్రి జరిగింది. కూచిపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అయ్యంకి గ్రామానికి చెందిన పడమటి నాగరాజు(40), గూడూరు మండలం మల్లవోలుకు చెందిన పడమటి నాగమునీశ్వరరావు(60) ద్విచక్ర వాహనంపై కూచిపూడి నుంచి అయ్యంకి వెళ్తున్నారు. భీమనది పంట కాలువ దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పామర్రు సీఐ వి.సుబాకర్, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకం.. కొత్త పుంతలు



'భారతీయ జర్నలిజం ధ్రువతార మానికొండ చలపతిరావు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ రామకృష్ణ, సీనియర్ పాత్రికేయులు

ప్రతిఫలం ఆశించని పాత్రికేయుడు మానికొండ

విజయవాడ కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తింపును, ప్రతిఫలాన్ని ఆశించకుండా పాత్రికేయ వృత్తిని నిర్వహించిన ఘనత మానికొండ చలపతిరావుకు దక్కుతుందని పలువురు పాత్రికేయ వక్తలు తెలిపారు. పుస్తక మహోత్సవంలో బుధవారం రామోజీరావు సాహిత్యవేదికపై నిర్వహించిన కార్యక్రమంలో ఆకుల అమరయ్య రచించిన 'భారతీయ జర్నలిజం ధ్రువతార మానికొండ చలపతి రావు' పుస్తకాన్ని జర్నలిజం మిత్రులంతా కలసి ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన శరత్‌చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ, నేటియుగంలో జర్నలిజం విలువలు దిగజారుతున్నాయని, అదే సమయంలో విలువలు కలిగిన జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరానికి మానికొండ చలపతిరావు లాంటి శిఖరాయమాన పాత్రికేయుడిని పరిచయం చేయడానికి ఈ రచన ఉపయోగపడుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, రాజధానిలో మానికొండ చలపతిరావుకు స్మృతి చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రచయిత ఆకుల అమరయ్య, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ఎస్.వెంకట్రావు, సీహెచ్ సతీష్‌రావు, ఆనందం, సాగర్ కుమార్, రాఘవ, విశాలాంధ్ర మేనేజర్ మనోహర్ నాయుడు పాల్గొన్నారు.



రైతును ముంచుతున్న పాలకుల విధానాలు, అసమానతలు-ఆర్థిక విధానాలు, విద్వేష రాజకీయాలు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బీవీ రాఘవులు, తదితరులు

మతోన్మాద, విద్వేష రాజకీయాలు : బీవీ రాఘవులు

నేటి రాజకీయాలను మతోన్మాదం, విద్వేషం నడిపిస్తున్నాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. పుస్తక మహోత్సవంలో వి.రాంభూపాల్ రచించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన రైతును ముంచుతున్న పాలకుల విధానాలు, అసమానతలు-ఆర్థిక విధానాలు, విద్వేష రాజకీయాలు' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రార్థనా స్థలాల చట్టాన్ని నేటి రాజకీయవర్గాలు అపహాస్యం చేస్తున్నాయన్నారు. పాత తప్పిదాలను సరి చేయడానికి కొత్తగా తప్పిదాలు చేయడం సరికాదన్నారు. ప్రకృతి వ్యవసాయం వెనుక వర్గపోరాట ధోరణి ప్రతిబింబిస్తుందన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకుడు ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ, నాగరికత పేరుతో సమాజంలో ప్రకృతి సహజమైన మౌలిక విలువలకు దూరం కావడం దురదృష్టకరమన్నారు. రచయిత రాంభూపాల్ మాట్లాడుతూ, వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరగడం వల్ల, వ్యవసాయ రుణాలు నిజమైన రైతులకు అందకపోవడం వల్ల, గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల రైతులకు భారమైపోతుందన్నారు.

అనువాదంలో విశేష కృషి చేసిన శ్రీనివాస గౌడ్

తనదైన అభివ్యక్తికోసం తపించి సాధించిన యువకవుల్లో శ్రీనివాస్ గౌడ్ అగ్రగణ్యుడని ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ అన్నారు. పి.శ్రీనివాస గౌడ్ రాసిన 'అంబపలుకు' కవితాసంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కవిత్వ భాషను, అందులో తనదైన శైలిని, బహుళార్థకతను సాధించడానికి ఎంతో ప్రతిభ, కృషి అవసరమన్నారు. సభకు అధ్యక్షత వహించిన బండ్ల మాధవరావు మాట్లాడుతూ, శ్రీనివాస్ గౌడ్ సాహితీరంగంలో వేగంగా ఎదుగుతూ, తనదైన గుర్తింపు సాధిస్తున్నాడని చెప్పారు. సుంకర గోపాల్ పుస్తకాన్ని సమీక్ష చేస్తూ సమాజంలోని ఎనిమిది కీలకాంశాలపై శ్రీనివాస్ గౌడ్ ప్రభావవంతంగా కవితలను సృజించారన్నారు. యాకూబ్, సత్యాజీ, శాంతిశ్రీ, పద్మకళ, కలిమిశ్రీ, పి.శ్రీనివాస్ గౌడ్ సభలో పాల్గొని ప్రసంగించారు.

- మహోత్సవంలో కొత్త ఒరవడిని చూస్తున్నాం
- ప్రచురణకర్తలను ఆదుకోవాలి
- వీబీఎఫ్ఎస్ కార్యదర్శి మనోహరనాయుడు









(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్) : "సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో పుస్తకం పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న ఆందోళన కలిగిస్తోంది. మ్యానియా, మీడియా ఏదైనా, ఎన్ని కొత్త ఒరవడులు తీసుకున్నా దానికి ఎలాంటి ఢోకా లేదని పుస్తక మహోత్సవం నిరూపిస్తోంది. ఒకప్పుడు హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో కనిపించిన పరిస్థితులు ఇప్పుడు విజయవాడ పుస్తక మహోత్సవంలో కనిపిస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి మనోహరనాయుడు. పుస్తక మహోత్సవంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, "పదేళ్ల తర్వాత విజయవాడ పుస్తక మహోత్సవంలో పాఠకుల రద్దీ కనిపిస్తోంది.. పుస్తక పఠనం తగ్గిందన్న సమయంలో పాఠకుల నుంచి ఈస్థాయిలో స్పందన రావడం సంతోషం కలిగిస్తోంది.. కొన్నాళ్లుగా నిరాశ నిస్పృహల్లో ఉన్న ప్రచురణకర్తల్లో ఆనందం కనిపిస్తోంది.. కొద్దిరోజుల క్రితం నిర్వహించిన పుస్తక ప్రియుల పాదయాత్రలో 4వేలమంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన పాదయాత్రల్లో ఇంత పెద్దమొత్తంలో విద్యార్థులు పాల్గొన్న దాఖలాలు లేవు. పుస్తకానికి మంచి రోజులు వస్తున్నాయన్న విశ్వాసం కలుగుతోంది. రోజుకు 1000 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పుస్తక మహోత్సవానికి వస్తున్నారు. యువత ఎక్కువగా హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు వచ్చేవారు. ఈ ఏడాది ఆ ఒవరడి విజయవాడలో కనిపిస్తోంది. ఇంజనీరింగ్ విద్యార్థులు అధికసంఖ్యలో రావడం గమనార్హం. విద్యాసంస్థల నుంచి వస్తున్న విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, బాలసాహిత్యం, హరీపాటర్ కథలు, అమరచిత్రకథ, మాంగా కామిక్స్ పుస్తకాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. వాటితోపాటు హర్రర్ కథల పుస్తకాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రతిభావేదికపై నిర్వహిస్తున్న కథల పోటీలు పిల్లల్లో సాహిత్యాభిలాషను పెంపొందిస్తున్నాయి. ఎన్నడూ లేనివిధంగా దేశం నలుమూలల నుంచి 103 మంది ఇంగ్లీష్ ప్రచురణకర్తలు ఈ పుస్తక మహోత్సవంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు." అని వెల్లడించారు.

● **జానపదానికి విజ్ఞానకోశం**

జనం నుంచి పుట్టుకొచ్చినవి జానపదులు. ఈ జానపదాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటాయి. ప్రాంతీయ అస్తిత్వాలతో స్థానిక మాండలికాలతో ముడిపడి ఈ జానపదాలు ఉంటాయి. దక్షిణ భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న జానపదాలకు ద్రవిడ విశ్వవిద్యాలయం విజ్ఞాన పదకోశాన్ని రూపొందించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఉన్న జానపదాల పుట్టుపూర్వోత్తరాలతో దక్షిణ భారతీయ జానపద విజ్ఞాన కోశం పేరుతో పుస్తకాన్ని ముద్రించింది. దీని వెల రూ.1000లు. కృష్ణా, గుంటూరు, ఖమ్మం, గోదావరి జిల్లాల్లో ఉండే గ్రామదేవత అంకమ్మ ఉత్సవాలు, ఆ సంబరాల్లో జరిగే జాపనదాల గురించి ఈ పుస్తకంలో వివరించారు. కన్నడలో అంకెయాటిగా ప్రసిద్ధి చెంది తెలుగులోకి అంకెలఆటగా వచ్చిన కన్నడ జానపదంపై వివరణ ఇచ్చారు. గోదావరి జిల్లాలో ఎక్కువగా సాగే అగ్నిగుండ ప్రదర్శనలపై ఈ విజ్ఞానకోశంలో ప్రస్తావించారు. స్టాల్ నంబరు 31లో ఉన్న విజయవాణి ప్రింటర్స్‌లో ఈ పుస్తకం అందుబాటులో ఉంది.



పుస్తక మహోత్సవానికి సందర్శకుల తాకిడి

స్కాన్ చేస్తే పుస్తకం ఉచితం



విజయవాడ సిటీలైఫ్ : పుస్తక మహోత్సవంలో ప్రతి పుస్తకానికి ఒక ధర ఉంటుంది. ఏ స్టాల్‌కు వెళ్లి పుస్తకం కొనుగోలు చేసినా డబ్బులు చెల్లించాలి. స్టాల్ నంబరు 33, 34లో ఏర్పాటు చేసిన పద్మావతి బుక్ డిస్ట్రిబ్యూటర్స్ మాత్రం దీనికి భిన్నం. ఇక్కడ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పుస్తకాన్ని ఉచితంగా తీసుకోవచ్చు. ఈ స్టాల్‌కు ఎదురుగా ఉచితంగా పుస్తకాలు అందజేయడానికి ఒక ర్యాక్‌ను ఏర్పాటు చేశారు. దీనికి ఒక క్యూఆర్ కోడ్‌ను అమర్చారు. ర్యాక్ నిండా ఇంజనీరింగ్ పుస్తకాలు ఉంటాయి. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రేటింగ్ ఇచ్చిన తర్వాత ర్యాక్‌లో నచ్చిన పుస్తకాన్ని తీసుకుని వెళ్లవచ్చు. పద్మావతి బుక్ డిస్ట్రిబ్యూటర్స్ ఇంజనీరింగ్ విద్యకు సంబంధించిన పుస్తకాలను ముద్రించారు. కొవిడ్ సమయంలో రెండేళ్లపాటు లాక్‌డౌన్ ఉండడంతో ఈ పుస్తకాలు గొడౌన్‌లో ఉండిపోయాయి. తర్వాత ఒక్కో అంశానికి సంబంధించిన పుస్తకాల్లో కొత్త అంశాలను చేర్చారు. అప్‌డేట్ సమాచారంతో పుస్తకాలు రావడంతో ఈ పుస్తకాల కొనుగోళ్లు జరగలేదు. ఎంతోకొంత మంది విద్యార్థులకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయన్న ఉద్దేశ్యంతో నిర్వాహకులు వాటిని ఉచితంగా అందజేస్తున్నారు.

పాఠక హృదయాల్లో నిలిచిన రచయిత శారద

- పెనుగొండ లక్ష్మీనారాయణ



విజయవాడ కల్చరల్ : ప్రజల్లో జీవించి, ప్రజల కష్టాలు ప్రతిఫలించేలా ప్రజల కోసం రచనలు చేసిన గొప్ప రచయిత నటరాజన్ అని అరసం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. పుస్తక మహోత్సవంలో శారద కలంపేరుతో గుర్తింపు పొందిన కథారచయిత సుబ్రహ్మణ్యమ్ నటరాజన్ శతజయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనదైన శైలితో, వ్యక్తీకరణతో సామాజిక స్పృహను కనబరుస్తూ పాఠకుల హృదయాల్లో నిలిచిపోయిన రచయిత నటరాజన్ అని చెప్పారు. ప్రముఖ రచయితగా గుర్తింపు పొందినప్పటికీ దుర్భర దారిద్ర్యాన్ని గడపవలసి వచ్చిందన్నారు. తమిళుడైనా తెలుగు ప్రాంతంలో హోటల్ సర్వర్‌గా జీవితాన్ని ప్రారంభించి, తనకున్న పఠనాసక్తితో అనతికాలంలో గుర్తింపు పొందిన రచయితగా మారాడన్నారు. శరత్‌చంద్ర జ్యోతిశ్రీ సభకు అధ్యక్షత వహించారు. గోళ్ల నారాయణరావు, విశాలాంధ్ర మనోహర్ నాయుడు ప్రసంగించారు.

పంచతంత్ర కథలంటే ఇష్టం

- వీరేందర్, స్లేట్ స్కూల్



విజయవాడ సిటీలైఫ్ : నాకు పంచతంత్ర కథలంటే చాలా ఇష్టం. ఎక్కువగా ఈ పుస్తకాలు చదువుతాను. మాకు స్కూల్‌లో నెలకు ఒక లైబ్రరీ పిరియడ్ ఉంటుంది. అప్పుడు మాత్రం ఇంగ్లీష్ కథల పుస్తకాలు చదువుతాను. పంచతంత్రం కథలు నైతిక విలువలు ఎలా ఉంటాయో తెలుపుతాయి.

పింఛన్ ఇచ్చి ఆదుకోరూ..!

- ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో రద్దవుతుందని దివ్యాంగురాలి ఆందోళన



మంచంలోనే ఉన్న కృష్ణకుమారిని పరిశీలిస్తున్న వైద్య బృందం

జగ్గయ్యపేట రూరల్, జనవరి 8 ఆంధ్రజ్యోతి : అన్ని అర్హతలున్నా ధృవీకరణ పత్రాలు లేకపోవటంతో తన పింఛన్ రద్దవుతుందని ఓ దివ్యాంగురాలు ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం వైద్యబృందం, అధికారుల ఎదుట ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. మండలంలోని బండిపాలెం గ్రామానికి చెందిన ఎర్రమాస కృష్ణకుమారి గత కొన్నేళ్లుగా దివ్యాంగ పింఛన్ అందుకుంటోంది. పింఛన్ అనర్హుల ఏరివేత కార్యక్రమంలో భాగంగా పరిశీలనకు వెళ్లిన అధికారుల బృందానికి ఆమె వద్ద ఎటువంటి ధృవీకరణ పత్రాలు చూపలేకపోయింది. ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో ఆమె పింఛన్ రద్దవుతుందని ఎంపీడీవో నితిన్ తెలిపారు.

● **కొన్నేళ్లుగా మంచానికే పరిమితం**

కృష్ణకుమారి కుమారుడు హేమంత్ (18) బ్లడ్ కేన్సర్‌తో జీవన్మరణ పోరాటం చేస్తున్నాడు. భర్త శేషగిరి సమీపంలోని కర్మాగారంలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఇటీవల కర్మాగారం కూడా మూతపడటంతో భార్య పింఛన్‌పైనే ఆ కుటుంబం ఆధారపడింది. ఉద్యోగరీత్యా పక్క రాష్ట్రానికి వెళ్లిన గ్రామానికి చెందిన ఒక దాత ఇచ్చిన ఇంటిలో వారు తాత్కాలికంగా నివాసముంటున్నారు. కుటుంబానికి ఆధారమైన ఒక్క పింఛన్ తొలగిస్తే తమ జీవనం అగమ్యగోచరమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు మానవతా దృక్పథంతో పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సౌతిండియా సైన్స్ ఫెయిర్‌కు పేట విద్యార్థుల ప్రాజెక్టు ఎంపిక



చంద్రశేఖర్ మాస్టారు ఆధ్వర్యంలో రూపొందిన ప్రాజెక్టు నమూనా

జగ్గయ్యపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నీటి విద్యుత్ వాహక ఆధారంగా వరదలు, తుఫాన్లు వచ్చినపుడు బ్రిడ్జిలు, వాహనాలు కొట్టుకుపోకుండా రక్షించే ప్రాజెక్టు రూపొందించిన జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ విద్యార్థుల నమూనా పాండిచ్చేరిలో జరగనున్న సౌతిండియా సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైంది. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గార్లపాటి చంద్రశేఖర్ మార్గదర్శకత్వంలో పదోతరగతి విద్యార్థులు ఎం.నాగతేజ, వై.భార్గవధనుషలు ఈ ప్రాజెక్టును రూపొందించారు. వరదలు వచ్చినపుడు తొలిదశలో బ్రిడ్జికి నీరు తాకగానే సెన్సార్‌లు ప్రభుత్వ వ్యవస్థలను సిద్ధం చేస్తాయి. దాంతో మోటార్ల సహాయంతో బ్రిడ్జి గేట్లు మూసుకుపోయి వాహనాలు రాకపోకలను నియంత్రిస్తూ బ్రిడ్జిని పైకెత్తటంతో అది కొట్టుకుపోకుండా చూస్తుంది. వరద తగ్గగానే తిరిగి బ్రిడ్జి యథాస్థితికి వచ్చేలా రూపొందించారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో సౌతిండియా ఫెయిర్‌కు ఈ ప్రాజెక్టు ఎంపికైంది. 2019లో అకాల వర్షాలు వచ్చినపుడు కల్లాల్లో ఉన్న పంటను కాపాడేందుకు రూపొందించిన ప్రాజెక్టు సౌతిండియా సైన్స్ ఫెయిర్‌లోను ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, విద్యార్థులను అభినందించారు.

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

ఇసుక కార్మికుల ఆందోళనలో ఉద్రిక్తం

(5వ పేజీ తరువాయి)

సీఐ చిట్టిబాబు కార్మికులకు నచ్చజెపుతున్నా ఫలితం లేకుండా ఉంది. గ్రామంలోని కార్మికులు ధర్నా శిబిరానికి రావాలని రాత్రి మైక్ ప్రచారం చేయించారు. దీంతో ఆందోళన ఏ రూపం దాల్చుతుందో తెలియకుండా ఉంది.

పులుముకున్న రాజకీయరంగు

తోట్లవల్లూరులో బుధవారం ఇసుక కార్మికులు చేపట్టిన ఆందోళనకు రాజకీయ రంగు పులుముకుంది. కృష్ణానదీపాయ వద్ద ఇసుక లారీని అడ్డుకుని ఉదయం నుంచి కొనసాగిస్తున్న ఆందోళన రాత్రి 8 గంటల సమయంలో కొట్లాటకు దారి తీసింది. కార్మికుల వద్దకు వైసీపీ నేత ఈడ్పుగంటి రూబేను రాగా టీడీపీ వైపు నుంచి వల్లూరుపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఈడే వాసు మరికొందరు వచ్చారు. తహసీల్దార్ ఎం.కుసుమకుమారి కార్మికులతో మాట్లాడుతుండగా వాసు కల్పించుకుని మీ ప్రభుత్వంలో ఇసుక తోలుకోలేదా, కార్మికులకు పని కల్పించారా అనటంతో ఉద్రిక్తపరిస్థితి నెలకొంది. పొరుగూరి నుంచి వచ్చి మాట్లాడటానికి నీకేంపని, మాపై దాడి చేస్తావా అంటు ఆందోళన చేస్తున్న కార్మికులు వాసుపై ఒక్కసారిగా దాడికి దిగారు. చీకట్లో ఎవరిని ఎవరు కొడుతున్నారో తెలియకుండా పోయింది. పోలీసులు వాసుని అతి కష్టంతో విడిపించి బయటకు తీసుకెళ్లారు. తరువాత సీఐ చిట్టిబాబుతో కార్మికులు వాదనకు దిగారు. లారీ ఓనర్ వచ్చేదాక కదిలేది లేదని కార్మికులు చెప్పటంతో తాము చర్యలు తీసుకోవలసి వస్తుందని సీఐ హెచ్చరించారు. సీఐని కూడా మీకేంపని అని కార్మికులు ప్రశ్నించటంతో తహసీల్దార్ ఫిర్యాదు ఇస్తే ఎక్కడికైనా వస్తామని సీఐ చిట్టిబాబు, మేము మీకు ఫిర్యాదు చేయలేదని, ఎందుకొచ్చారని కార్మికులు ఎదురు ప్రశ్నించారు. దీంతో సీఐ టెంట్ తొలగించేందుకు సిద్ధపడటంతో కార్మికులు అడ్డుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ఆందోళన కారులను పోలీసులు చెదరకొట్టే ప్రయత్నం చేశారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ పెద్దలు తెరవెనుక ఉండి కథ నడిపించటం వల్లే సమస్య జఠిలమయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితి కార్మికులకు నష్టం తెచ్చేవిధంగా తయారయింది.

అవినీతిలో బాద్‌షా

(5వ పేజీ తరువాయి)

పంపారు. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు వచ్చే జీతంలో కనీసంగా 25శాతం మేర కమీషన్ రూపంలో ఇస్తేనే జీతాల బిల్లులు చేస్తున్నట్లు ఆశాఖ ఉద్యోగులు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో సదరు అధికారి పనితీరు రోజురోజుకు వివాదాస్పదమవుతోంది.

వసతి గృహాలకు వెళ్లి రికార్డులు తెచ్చి..

సదరు అధికారి వసతిగృహాలకు పరిశీలన నిమిత్తం వెళతారు. రికార్డులు సక్రమంగా నిర్వహించడంలేదని, పర్యవేక్షణ సక్రమంగా లేదని, అవకతవకలు జరిగాయనే కారణాలు చూపి వసతి గృహాల రికార్డులను తనతో పాటు తెచ్చుకుంటారు. ఈ రికార్డులు తిరిగి ఇవ్వాలంటే కనీసంగా రూ.25వేలు సమర్పించుకోవాల్సిందేనని పలువురు వార్డెన్లు వాపోతున్నారు. రెండు నెలల కిందట ఒక ఉద్యోగిని తన కారు డ్రైవర్‌గా పనిచేయాలని సదరు అధికారి కోరారు. తాను చేయలేనని ఉద్యోగి చెప్పాడు. దీంతో ఆ ఉద్యోగిని దూర ప్రాంతానికి బదిలీ చేసి, రెండు నెలల జీతం పెండింగ్ పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు అధికారి పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లి, తీసుకువచ్చేందుకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే ఉద్యోగిని కారు డ్రైవర్‌గా ఉపయోగించుకుంటున్నారు. మరో ఇద్దరు ఉద్యోగులు ఈ అధికారి ఇంటి వద్దనే ఉండి పనులు చేస్తుండటం గమనార్హం. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న ఉద్యోగులను తన ఇంటి పనులు చేసేందుకు ఉపయోగించుకోవడం ఈ అధికారికే చెల్లిందని సంబంధితశాఖ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

శరవేగంగా..

(5వ పేజీ తరువాయి)

క్రాసింగ్ గేట్లను విద్యుదీకరించారు. ఈ ప్రాజెక్టు కారణంగా ఉమ్మడి గోదావరి, కృష్ణాజిల్లాల్లో అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ పరిశ్రమ ఊపందుకుంటుంది. అలాగే, విజయవాడ-విశాఖపట్నం రైలు మార్గంలో ప్రకృతి విపత్తుల కారణంగా ఏదైనా ఇబ్బంది తలెత్తినప్పుడు ఈ మార్గం ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.05

ఏటీఎం కార్డు మార్చి రూ.40 వేలు అపహరణ

ఉయ్యూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎం కార్డు మార్చి రూ. 40వేలు తీసుకుని అగంతకుడు ఉడాయించిన సంఘటన బుధవారం ఉయ్యూరు ఎస్‌బీఐ ఏటీఎం వద్ద జరిగింది. గండిగుంట గణపతి సచిదానంద జ్ఞానబోధ సభలో పూజారిగా చేస్తున్న శ్రీనివాసాచార్యులు కాటూరు రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంకు వచ్చి డబ్బు తీసుకునేందుకు కార్డుతో ప్రయత్నిస్తుండగా ఎర్రర్ వచ్చింది. వెనుక ఉన్న వ్యక్తి నేను తీసి ఇస్తానని కార్డు తీసుకుని ఏటీఎంలో డబ్బు తీసేందుకు ప్రయత్నిస్తున్నట్టు నటించి రావడంలేదని కార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. దీంతో శ్రీనివాసాచార్యులు మరోసారి ప్రయత్నించగా డబ్బులు రాకపోవడంతో కార్డును పరిశీలించగా, ఆ వ్యక్తి ఇచ్చి వెళ్లిన కార్డు తనది కాదని గ్రహించాడు. బ్యాంకుకి వెళ్లి విచారించగా అప్పటికే తన ఖాతా నుంచి రూ. 40వేలు తీసినట్టు తెలిసింది. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో బీహార్ కార్మికుడు మృతి

హనుమాన్‌జంక్షన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులో జెర్సీ పాలఫ్యాక్టరీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్‌కు చెందిన కార్మికుడు మృతి చెందాడు. బీహార్ రాష్ట్రం బోత్‌గయా జిల్లా కోసల గ్రామానికి చెందిన అజయ్ మాంజీ (25) మల్లవల్లి ఏపీఐఐసీలోని ఓ పరిశ్రమలో పని చేయడానికి మంగళవారం జంక్షన్ వచ్చాడు. ఫ్యాక్టరీలో తన పేరు నమోదు చేసుకొని తిరిగి జంక్షన్ వైపు కలినడకన వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై మృతి చెందాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలకు సకాలంలో మరమ్మతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కాలువల చివరి భూములకు కూడా సకాలంలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని జలవ నరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును ఎన్ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. విజయవాడలోని జలవనరుల శాఖ కార్యాలయంలో బుధవారం డీసీ చైర్మన్‌లతో కలిసి ఆళ్ల జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులకు సేవలందించేందుకు తమకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతగా పచ్చకండువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలువలకు సకాలంలో మరమ్మతులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ, పామర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మల రామానాయుడుతో నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ

తిరుపతమ్మ సేవాసదన్‌కు రూ.లక్ష విరాళం

ఉంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం తిరుపతమ్మ సేవాసదన్ (కళ్యాణమండపం) నిర్మాణానికి అమెరికాకు చెందిన కొణసాని శేఖర్‌బాబు, అరుణ దంపతులు వారి తాత కొణసాని బైరాగి, కృపావతమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ. 50,116, ముత్తాత జాస్తి కోటయ్య, సౌభాగ్యమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ. 50,116 మొత్తం రూ. 1.232 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని శేఖర్‌బాబు తల్లిదండ్రులైన కొణసాని సాంబశివరావు, రంగభారతి దంపతులు బుధవారం ఆలయ కమిటీకి అందజేశారు. జాస్తి శ్రీధర్, జాస్తి ఫణిశేఖర్, కాసర్నేని నాని పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈవో పీవీజే రామారావు

ఉయ్యూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రభుత్వ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక క్లాసులు నిర్వహించి విద్యార్థుల్లో నమ్మకం కలిగించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ముందు కువచ్చే దాతలను ప్రోత్సహించి పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. డీసీఈబీ సెక్రటరి ఎస్‌కె జాన్‌సాహెబ్, డీవైఈఓ జి పద్మారాణి పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

ఉంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు లేని ప్రాంతాల్లో పట్టాభూములు కొనుగోలు చేసి పేదలకు ఇళ్లస్థలాలుగా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గన్నవరం మండలం అల్లాపురం దళితుల కాలనీలో పేద మహిళలు ఇళ్లస్థలాల కోసం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్లస్థలాలకు అనువుగా వుండే ప్రభుత్వ స్థలాల్లో మాత్రమే పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లస్థలాలకు అనువుగా లేని ప్రభుత్వ భూముల్లో పట్టాలిచ్చారని, ఆస్థలాలు కూడా గ్రామానికి సుదూరంగా వుండటంతో అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు పేదలు విముఖత చూపుతున్నారన్నారు. ప్రభుత్వ భూములు లేని గ్రామాల్లో ఏ ఒక్క పేదవాడికి పట్టాలిచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 10న సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ముందు జరిగే ఆందోళనలో ఇళ్లస్థలాలు లేని నిరుపేదలందరూ పాల్గొని వ్యక్తిగత అర్జీల ద్వారా తమ గోడును రెవెన్యూ అధికారులకు విన్నవించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గన్నవరం నియోజకవర్గ నాయకులు కొండా వీరాస్వామి, గేదెల సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు

వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కంకిపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గుణదల సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ సరఫరాను గురువారం కొన్ని గంటల పాటు నిలిపివేయనున్నట్టు కంకిపాడు విద్యుత్ శాఖ అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, గుణదల సబ్‌స్టేషన్ 220 / 132 పరిధిలోని కంకిపాడు, ఈడుపుగల్లు, ఉప్పలూరు, మద్దూరు, ప్రొద్దుటూరు, మారేడుమాక, కోలవెన్ను సబ్‌స్టేషన్స్ పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ విద్యుత్‌ను గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయనున్నట్టు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

రాగి వైరు చోరీ

హనుమాన్‌జంక్షన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జంక్షన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి లోని బిళ్లనపల్లి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు ట్రాన్స్‌ఫారం పగలకొట్టి అందులో ఉండే రూ. 50 వేలు విలువ చేసే రాగి వైరును అపహరించుకుపోయారు. ఈ మేరకు జంక్షన్ పీఎస్‌లో విద్యుత్ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ బుధవారం ఫిర్యాదు చేశారు.



రక్తదానం కార్యక్రమంలో నిర్వాహకులు

45 మంది రక్తదానం

పెనమలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులతో రక్తదాన శిబిరం నిర్వహించారు. 45మంది విద్యార్థులు రక్తదానం చేసిన ఈ శిబిరాన్ని లయన్స్‌క్లబ్, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా నిర్వహించగా గొల్లపూడి ఆంధ్ర ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అచ్యుత బాబు పర్యవేక్షించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.



దుప్పట్లు పంపణీ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఉయ్యూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, పూర్ణచంద్రరావు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మండలంలో వివిధ పంచాయతీలలో పనిచేస్తున్న కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ల యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం ఎండీవో కార్యాలయంలో ఎంపీడీవో టి.స్వర్ణలత అధ్యక్షతన జరిగింది. అధ్యక్షులుగా బుద్ధవరం పంచాయతీ కార్యదర్శి ఎం.సరోజినీ, సెక్రటరీగా గన్నవరం పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవ, అసోసియేట్ సెక్రటరీగా లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా నాగసాయి, భార్గవసాయి, నాయక్, జాయింట్ సెక్రటరీలుగా హర్షవర్థిని, రాజశేఖర్, కోశాధికారిగా వీడీ శ్రీనివాస్ ఎన్నికయ్యారు.



తంబి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న గుడిపెద్దలు

విలువలు కలిగి జీవించాలి

- రెవ.ఫాదర్ మాదాసు ఆంతోని

ఉంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మానవ జాతి మనుగడ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాముఖ్యత వుందని, కుటుంబంలో ప్రతి ఒక్కరూ ప్రేమ, విశ్వాసం, నిరీక్షణ, నమ్మకం, శాంతి, సమాధానాలు, సఖ్యతతో విలువలు కలిగి జీవించాలని హైదరాబాద్ సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవ.ఫాదర్ మాదాసు ఆంతోని అన్నారు. పెదఅవుటపల్లిలోని తంబి పుణ్యక్షేత్రంలో నవదిన ప్రార్థనలు బుధవారం ఐదవరోజు ఘనంగా జరిగాయి. సాయంత్రం తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన నవదిన ప్రార్థనలకు ప్రధాన యాజకుడుగా ఫాదర్ ఆంతోని హాజరయ్యారు. తొలుత తంబి చిత్రపటాన్ని గుడిపెద్దలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా కళావేదిక వద్దకు తీసుకురాగా, ఫాదర్ ఆంతోని ఇతర గురువులతో కలిసి దివ్యపూజాబలిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు రెవ.ఫాదర్ గోపు అభిలాష్, సహాయక గురువులు, గుడిపెద్దలు, కన్యాస్త్రీలు, మరియదళ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లవల్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి పారిశ్రామికవాడకు సాగుభూములిచ్చిన రైతులకు నష్టపరిహారం అందించకుండా నియంతృత్వ ధోరణిలో ఇళ్ల దగ్గర పోలీస్ బందోబస్తుతో అభివృద్ధి పనులు చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరి జనసేన పార్టీ ఆఫీస్‌కు మంగళవారం రాత్రి వెళ్లామని మల్లవల్లి రైతులు మురళీకృష్ణ, ప్రసాద్ తదితరులు బుధవారం తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ప్రోగ్రాం కమిటీ కన్వీనర్ కె.కెలు రైతులను కలిశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖపట్నం ప్రధాని పర్యటనలో ఉన్నందున ప్రస్తుతం ఆయన్ను కలిసేందుకు కుదరదని, జనవరి 10 తరువాత సమయాన్ని కేటా యించి తెలియజేస్తామని వారి వెంట ఉన్న జనసేన అధికార ప్రతినిధి మరీదు రామకృష్ణకు తెలిపారు. దీంతో ఆయన రైతులతో చర్చించి రైతులను ఇళ్లకు వెళ్లేలా ఒపించి పంపించారు.

చిరుతపులి సంచారంపై ప్రజలకు అవగాహన

ఉంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం, మెట్లపల్లిలో ఇటీవల పందులకు అమర్చిన బోనులో పడి చిరుతపులి చనిపోవటం అనంతరం సగ్గూరు-మెట్లపల్లి మార్గంలో ఆర్టీసీ కండక్టర్‌కు పులి పిల్ల కనబడటం వంటి సంఘటనల నేపథ్యంలో భయభ్రాంతులకు గురౌతున్న పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తంచేసి పులి సంచారంపై అవగాహన కల్పించే దిశగా అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ పి.సునీత ఆదేశాలమేరకు వీరపనేనిగూడెం, సూరవరం, మెట్లపల్లిలో పర్యటించిన ఫారెస్ట్ రేంజ్ అధికారుల బృందం తొలుత ఆయాగ్రామాల్లో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుజాత మాట్లాడుతూ చిరుతపులి సంచారాన్ని అటవీ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందవద్దని సూచించారు. చిరుతపులి కదలికలు, అడుగుల ముద్రలు కనబడితే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 18004255909, అటవీ క్షేత్రాధికారి(తూ.గో.జిల్లా) 9849156162, మానిటరింగ్ టీమ్ 9705909066 నెంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిరుతపులి బారి నుంచి రక్షించుకునేందుకు అనుసరించాల్సిన చర్యలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎఫ్ఆర్వో సుజాత, డిప్యూటీ ఆర్వో జయప్రకాష్, ఎఫ్‌బీవో కుమారి పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పేదలకు మెరుగైన వైద్యసేవలు

కంకిపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని నెప్పల్లి గ్రామానికి చెందిన నర్రాల శివయ్య ఆసుపత్రి ఖర్చుల కోసం సీఎం ఆర్ఎఫ్ నుంచి మంజూరు అయిన రూ. 25 వేల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని తెలి పారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ పేదలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు చింతపల్లి కోటేశ్వరరావు, కొలుసు గోవిందు, లంకపల్లి ఫణి, వినయ్, నాని పాల్గొన్నారు.



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరమణ

రోడ్డు భద్రతపై అవగాహన

పెనమలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పెనమలూరు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం తాడిగడప వందడుగుల రోడ్డులోని ట్రాఫిక్ ఐలెండ్ వద్ద సీఐ తన సిబ్బందితో కలిసి హెల్మెట్ వాడకం, యాక్సిడెంటు జరగడానికి అవకాశం ఉన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొల్లా నరేంద్ర ట్రాఫిక్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.

ముగ్గుల పోటీల పోస్టర్ ఆవిష్కరణ



ఉయ్యూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాల్లో భాగంగా వంశీ రాయల్ సిటీ ఆధ్వర్యాన ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు సుధీర్ టింబర్, వంశీగ్రూప్ అధినేత నూకల సాంబశివరావు తెలిపారు. బైపాస్ రోడ్డులో శ్రీవిశ్వశాంతి స్కూల్ సమీపాన వంశీరాయల్ సిటీలో బుధవారం ముగ్గుల పోటీల పోస్టర్‌ను స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. తల్లం హనుమంతరావు, ఇస్మాయిల్, నేరెళ్ల తేజ, లయన్స్, సత్తార్, రోటరీ, వాసవీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సర్వమానవ శ్రేయస్సు కోసమే నగర సంకీర్తన



ఉంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా సర్వమానవ శ్రేయస్సు కోరుతూ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉంగుటూరు, చాగంటిపాడు గ్రామాల్లో నగర సంకీర్తన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునుంచే గోవింద మాలాధారులు, మహిళా భక్తులంతా కలిసి సామూహికంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల నుంచి నగర సంకీర్తన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ పూడి లక్ష్మి సర్వ సహ కన్వీనర్ వనజారాణి, తాళంభజన భక్తబృందం ప్రముఖులు ధనలక్ష్మి, ఉష పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు

తరగతి గదులు మినీ ల్యాబ్‌లుగా మారాలి

» సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు

పెనమలూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని తరగతి గదులు మినీ ల్యాబుల్లా, విద్యార్థులు వివిధ పరిశోధనలు చేసే స్థాయికి ఎదగాలని సర్వశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. బుధవారం పోరంకి మురళీ రిసార్ట్సులో నిర్వహించిన రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన రెండో రోజు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వ్యక్తిగత విభాగం నుంచి 15, గ్రూపు నుంచి 10, ఉపాధ్యాయ ఎగ్జిబిట్స్ నుంచి పది అద్భుత ప్రదర్శనలను ఎంపిక చేసి ఈనెల 20 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో నిర్వహించే దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు పంపుతామని ఆయన తెలిపారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి, కంకిపాడు, పెనమలూరు ఎంఈవోలు పాల్గొన్నారు.

అయ్యప్పను దర్శించకుండానే..

అనంతలోకాలకు

» శబరిమల యాత్రలో విషాదం

» గుండెపోటుతో చల్లపల్లివాసి మృతి



ఆకుల నాగవిజయ్‌బాబు(ఫైల్)

చల్లపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష తీసుకుని శబరిమల సన్నిధానంలో అయ్యప్పను దర్శించకుండానే ఓ భక్తుడు కన్నుమూశాడు. పంబ నుంచి నడిచి వెళుతూ గుండెపోటుతో కుప్పకూలాడు. ఈ విషాదకర ఘటన చల్లపల్లి, పెదప్రోలు గ్రామాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. చల్లపల్లి గ్రామానికి చెందిన ఆకుల నాగ విజయ్‌బాబు(40) సహచరులతో కలిసి అయ్యప్పస్వామి దర్శనానికి సోమవారం శబరిమల బయలుదేరాడు. స్వాములతో కలిసి మంగళవారం రాత్రి పంబ చేరుకుని బుధవారం తెల్లవారుజామున శరంగుత్తి వద్ద నడుస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లినా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విజయ్‌బాబు స్వగ్రామం మోపిదేవి మండలం పెదప్రోలు, కాగా చల్లపల్లిలో గ్యాస్ కంపెనీ వద్ద నివాసముంటున్నాడు. కప్తానుపాలెం రైస్‌మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆయన అయ్యప్ప దీక్ష తీసుకోవడం 12వ సారి అని బంధువులు తెలిపారు. విజయ్ భౌతికకాయం గురువారం గ్రామానికి చేరుకుంటుందన్నారు.

ఖో-ఖో ప్రపంచకప్ రిఫరీగా మడకా ప్రసాద్



గుడివాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో ఈనెల 13న నిర్వహించే ప్రథమ ఖో-ఖో ప్రపంచ కప్ పోటీలకు చీఫ్ రిఫరీగా గుడివాడకు చెందిన వ్యాయామోపాధ్యాయుడు మడకా ప్రసాద్ ఎంపికయ్యారని ఖో-ఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఖో-ఖో సంఘం రిఫరీస్ బోర్డు కన్వీనర్‌గా మడకా ప్రసాద్ వ్యవహరిస్తున్నారు. ఏషియన్, సౌత్ ఏషియన్, జాతీయ క్రీడల్లో రిఫరీగా వ్యవహరించిన అనుభవం ఆయనకు ఉంది. మడాక ప్రసాద్‌కు ఖో-ఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

» డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు



జిల్లా జైలులో మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణయ్య, పక్కన డీసీపీ కృష్ణమూర్తినాయుడు

ధర్నాచౌక్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల అనేక మానసిక, అనారోగ్య సమస్యలు వస్తాయని వీటికి దూరంగా ఉండాలని ఖైదీలకు డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు సూచించారు. నగరంలోని జిల్లా జైలును ఏపీఎస్ఎల్ఎస్ఏ ప్రతినిధులు బుధవారం సందర్శించారు. తొలుత జైలు పరిసరాలు, బ్యారక్‌లను పరిశీలించారు. మత్తుకు బానిసై నేరాలకు పాల్పడి జైలుకు వస్తున్నారని, మత్తు పదార్థాల వినియోగాన్ని మానుకోవాలని డీసీపీ సూచించారు. జైలులో వ్యక్తిగత శుభ్రత పాటించాలని, సత్ప్రవర్తనతో మెలగాలని, మంచివారిగా బయటకు వెళ్లాలని ఖైదీలకు డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని సూచించారు. కేసుల పరిశీలనలో న్యాయస్థానం ముఖ్యపాత్ర పోషిస్తోందని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.రామకృష్ణయ్య తెలిపారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జైలు పర్యవేక్షణాధికారి హంసపాల్, జైలు అధికారి ఎన్.గణేష్, జైలర్లు సీహెచ్ వేణు, బి.గోపయ్య నాయక్, డిప్యూటీ జైలర్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతమ్మ కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం ఫిబ్రవరి 11వ తేదీ రాత్రి నిర్వహించనున్న విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై బుధవారం సమీక్షాసమావేశాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ కిషోర్ కుమార్ అధ్యక్షతన అమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్డీవో బాలకృష్ణ విచ్చేశారు. అమ్మవారి కల్యాణానికి వేలాదిగా వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల అందరిపై ఉందన్నారు. ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, చైర్మన్ శ్రీనివాసరావు, తహసీల్దార్ శాంతిలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్.రమా, ధర్మకర్తలు, పంచాయతీరాజ్ ఏఈ పి.సుందరరామయ్య, డాక్టర్ సుజని పాల్గొన్నారు.



ఫెర్రీ వద్ద కృష్ణానదిలో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

ఇబ్రహీంపట్నం/ ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, జీవనోపాధికి అన్ని చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం ఫెర్రీ వద్ద ఆయన గంగపుత్రులతో కలిసి భారీగా చేప పిల్లలను విడుదల చేశారు. కృష్ణానదిలో మత్స్య సంపదను పుష్కలంగా పెంచే క్రమంలో ప్రతి ఏడాది మత్స్యశాఖ ద్వారా చేప పిల్లలను విడుదల చేస్తున్నామన్నారు.

సంక్రాంతికి

పెనుగంచిప్రోలులో క్యాసినో

» ఏర్పాట్లు చేస్తున్న గుడివాడ క్యాసినో కింగ్ అనుచరులు

» జూదగాళ్ల కోసం ఇప్పటికే ఏసీ రూమ్‌లు, ఫంక్షన్ హాళ్లు బుక్..రూ.లక్షల్లో అడ్వాన్సుల చెల్లింపు

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

సంక్రాంతికి నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో భారీగా కోడి పందేలు, జూదం నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలులో క్యాసినో తరహాలో జూదం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గుడివాడలో నిర్వహించిన క్యాసినో కింగ్ అనుచరులు ముగ్గురు పెనుగంచిప్రోలులో ఏర్పాట్లు చేయిస్తున్నారని తెలుస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే జూదగాళ్లు మూడు రోజులు ఇక్కడే ఉండేందుకు, వారికి తగిన సదుపాయాలు కల్పించేందుకు ముందుగానే ఏసీ రూమ్‌లు, మామిడి తోటల్లోని ఫంక్షన్ హాళ్లను రూ.లక్షలు అడ్వాన్సులుగా ఇచ్చి అద్దెకు తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. భారీ ఏర్పాట్లపై స్థానిక ఇంటిలిజెన్స్ అధికారులు ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. క్యాసినో నిర్వహణ కోసం ముఖ్యులైన కొంత మందిని కలిసి నిర్వాహకులు నగదు అందజేస్తున్నారని తెలిసింది.

మామిడితోటలు, రియల్ ఎస్టేట్ వెంచర్లలో బరులు

నందిగామ డివిజన్ పరిధిలో అధికార పార్టీ నేతలతో కలిసి కోడి పందేల నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. చందర్లపాడు, పల్లగిరి, అనాసాగరం, పరిటాల, గండేపల్లి, భీమవరం, గరికపాడు, తొర్లగుంటపాలెం, జగ్గయ్యపేట, బూదవాడ, లింగాల ప్రాంతాల్లో మామిడి తోటలను, ఖాళీగా ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్లను ఖాళీ స్థలాలను బాగుచేస్తున్నారు.

కోడి పందేలు, జూదానికి అనుమతి లేదు

'నందిగామ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కోడి పందేలు, జూదం నిర్వహణకు అనుమతి లేదు. పందేలు, జూదం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.' అని రూరల్ డీసీపీ మహేశ్వరరాజు విలేకరులకు తెలిపారు.

ప్రత్యేక బృందాలు నియమించాం

'ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాల వారీగా ప్రత్యేక బృందాలను నియమించాం. ఎక్కడికక్కడ ప్రత్యేక బృందాలు పర్యటిస్తూ, జూదం జరగకుండ చూస్తాయి. మాకు సమాచారం అందిస్తాయి.' అని నందిగామ ఏసీపీ తిలక్ పేర్కొన్నారు.



పామర్రు మండలం అడ్డాడ సమీపంలో సిద్ధమవుతున్న కోడిపందేల బరి

సిద్ధమవుతున్న బరులు

(ఆంధ్రజ్యోతి-పామర్రు): పామర్రులో జూద నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన గ్రామనేతలతో చేతులు కలిపి బరులు సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. గుడివాడ- పామర్రు ప్రధాన రహదారి పక్కన అడ్డాడ సమీపంలో కొత్త పెదమద్దాలిలో ఓ ఇటుక బట్టీ వ్యాపారి పొలంలో బరి ఏర్పాటు చేస్తున్నారు. అందులో స్టాల్స్ నిర్వహించుకోవడానికి బుధవారం నుంచి సన్నాహాలు ప్రారంభించారు. పేకాట, కోడిపందేలు, గుండాటలకు నిర్వాహకులు రూ.లక్షలు తీసుకున్నారని సమాచారం. బరి సిద్ధం చేయడంపై స్థానిక పోలీసుల వద్ద సమాచారం ఉన్నా చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం మనది.. ఆపేదెవరు?

ఏటా బోగి పండుగ ముందు వరకు పోలీసులు హడావుడి చేస్తారని, తర్వాత కన్నెత్తి చూడరని, ప్రభుత్వం మనది.. మనల్ని ఆపేదెవరని మండలానికి చెందిన ఓనేత నిర్వాహకులకు అభయమిస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా కోట్లాది రూపాయల విలువ చేసే మట్టి తరలించిన ఆ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వంలోనూ అదే పంథా కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొత్తూరు తాడేపల్లి, పాతపాడులో అనధికారికంగా పోలవరం మట్టి తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికా రులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనధికారికంగా మట్టి తరలిస్తున్న వారితో లాలూచీపడి వారి నుంచి భారీ ముడుపులు అందుకుంటున్నారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.





మట్టి తరలిస్తున్న టిప్పర్లు, డ్రైవర్లతో మాట్లాడుతున్న నున్న పోలీసు

అనధికార మట్టి తోలకాలు

కొత్తూరు తాడేపల్లి, పాతపాడులో పోలవరం కాలువ మట్టి తరలిస్తున్న వైసీపీ నేతలు

» ముడుపులందడంతో మిన్నకుంటున్నారని అధికారులపై ఆరోపణలు

వన్‌టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కొత్తూరు తాడేపల్లిలో స్థానిక వైసీపీ నాయకులు వారం నుంచి పోలవరం కాలువ మట్టిని రాత్రి వేళలో పదుల సంఖ్యలో వాహనాల్లో తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది ప్రభుత్వ అధికారుల అండదండలతోనే ఈ తోలకాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఫిర్యాదు చేస్తే అధికారులు తమ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశారే తప్ప మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మట్టి తవ్వే యంత్రాలు, మట్టి తరలించే వాహనాలను కనీసం అడ్డుకోలేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు, సిబ్బంది వెళ్లిన కొద్దిసేపటికే మరలా మట్టి తరలిస్తున్నారని అంటున్నారు. మంగళవారం రాత్రి 9 గంటలకు కొత్తూరు తాడేపల్లి నుంచి 17 టిప్పర్లలో గుణదలలోని ఓ వెంచర్‌కు మట్టి తరలిస్తున్నారని సమాచారమందడంతో నున్న పోలీసులు వచ్చారు. 7 వాహనాలను ఆపి డ్రైవర్ల నుంచి వాహనాల సీ బుక్‌లు, సెల్‌ఫోన్లు, వాహనాల తాళాలు స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న వెనక వస్తున్న 10 టిప్పర్ల డ్రైవర్లు వారి వాహనాలను దారి మళ్లించి జన సంచారం లేని ప్రాంతంలో నిలుపుదల చేశారు. పోలీసులు టిప్పర్లను ఆపారని సమాచారం తెలుసుకున్న కొత్తూరు తాడేపల్లికి చెందిన వైసీపీ నాయకుడు బి.రాజు నున్న పోలీసు స్టేషన్ అధికారులతో బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు మంతనాలు జరిపినట్లు సమాచారం. తరువాత పోలీసు అధికారులు ఆ వాహనాలపై ఎలాంటి కేసు లేకుండా వదిలివేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఓ అధికారికి పెద్ద మొత్తంలో ముడుపులు అందాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాతపాడులో 15 రోజుల నుంచి యథేచ్ఛగా..

నున్న - పాతపాడు మధ్య పోలవరం కాలువ మట్టిని పాతపాడుకు చెందిన వారు 15 రోజుల నుంచి యథేచ్ఛగా రాత్రివేళలో పదుల సంఖ్యలో వాహనాలు (టిప్పర్లు)లో తరలిస్తున్నారు. ఈ వ్యవహారంలో పాతపాడుకు చెందిన ఓ వైసీపీ నాయకుడు కీలకంగా వ్యవహరించినట్లు స్థానికులు చెబుతున్నారు. రోజూ లక్షలాది రూపాయల విలువ చేసే మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే చెబుతున్నారు. దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ప్రభుత్వ అధికారులు స్పందించి మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇన్సెంటివ్‌లు చెల్లించండి

» ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు పీటీడీ ఎన్ఎంయూఏ లేఖ

వన్‌టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు 2022 జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న స్పాట్, మంత్లీ ఇన్సెంటివ్‌లను చెల్లించాలని ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(పీటీడీ ఎన్ఎంయూఏ) బుధవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఓ లేఖ ఇచ్చింది. ఇప్పటికే రాతపూర్వకంగా ఈ అంశాన్ని తెలియజేశామని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ సమావేశంలోనూ చెల్లింపులకు ఆమోదం తెలిపి ఏడాది అవుతున్నప్పటికీ కార్యాచరణకు అడుగు పడలేదని అందులో పేర్కొంది. ఇప్పటికైనా విజ్ఞప్తిని మన్నించి బకాయిలతో సహా చెల్లింపులకు ఆదేశాలు ఇవ్వాలని కోరింది. డీపీటీవోల మీటింగ్‌లోనూ ప్రతి నెలా దీనిపై సమీక్ష జరపాలని కోరింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇంజనీరింగ్)కు ఇచ్చిన మరో లేఖలో ప్రమాద రహిత సర్వీసు రికార్డు ఉన్న డ్రైవర్లకు 2023-24, 2024-25 సంవత్సరాలకు సేఫ్టీ డ్రైవింగ్ అలవెన్స్‌ను ఇవ్వాలని పీటీడీ ఎన్ఎంయూఏ కోరింది. ప్రమాదరహిత డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్ అలవెన్సు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ చాలా డిపోల్లో ఇవ్వడం లేదని, రెండేళ్ల నుంచి ఇవ్వాల్సిన అలవెన్స్‌లు ఇప్పటికైనా చెల్లించేలా యూనిట్లకు తగు ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

ఏపీ స్కలింగ్, రోయింగ్ అధ్యక్షుడిగా తరుణ్ కాకాని



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు తరుణ్ కాకాని, కార్యవర్గం


విజయవాడ స్పోర్ట్సు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కలింగ్, రోయింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నగరంలోని ఓ హోటల్‌లో జూమ్ ద్వారా బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అమరావతి బోటింగ్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకానీని తిరిగి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పి.భాస్కరరెడ్డి(అనంతపురం), ఎం.పవిత్ర కొండ్రెడి(ఎన్టీఆర్), సెక్రటరీ ఎన్.పవన్‌కుమార్(ఎన్టీఆర్ జిల్లా), జాయింట్ సెక్రటరీలుగా రంభా ప్రసాద్(ఎన్టీఆర్), శ్రీనివాస్ పడి(శ్రీకాకుళం) స్పెషల్ ఇన్వైటీగా పీసీ మస్తాన్(కడప), ట్రెజరర్‌గా పి.లావణ్య(కృష్ణా), ఈసీ మెంబర్లుగా కె.కృష్ణమూర్తి(ఏలూరు జిల్లా), రాఘవేంద్ర(ఎన్టీఆర్), జి.కిషోర్(గుంటూరు)ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ పి.శ్రీరామ్, శాప్ పరిశీలకుడిగా డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, లీగల్ అర్బిటర్ హైకోర్టు న్యాయమూర్తి డి.రమేష్‌కుమార్ వ్యవహరించారు. ఎంపికైన కార్యవర్గం 2029 వరకు పదవిలో ఉంటుంది. గత నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 106 మంది క్రీడాకారులను తయారు చేశామని, గోవా జాతీయ క్రీడల్లో ఏపీ టీమ్ క్వార్టర్స్‌కు చేరిందని అధ్యక్షుడు తరుణ్ కాకాని వివరించారు. ఈ క్రీడను మరింత ప్రాచుర్యంలోకి తేవడంతో పాటు విజయవాడలోనే జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్ నిర్వహణకు అన్ని విధాలా కృషి చేస్తానని ఆయన వివరించారు.

కార్పొరేట్ కళాశాల విద్యార్థిని మృతి

» యాజమాన్యమే కారణమంటున్న తల్లి, బంధువులు

» అనారోగ్యంతోనే అంటున్న యాజమాన్యం

» మృతి వార్త విని తండ్రికి గుండెపోటు



విద్యార్థిని గంగాభువనేశ్వరి(ఫైల్)



కళాశాల వద్ద రోదిస్తున్న తల్లి

పెనమలూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక కార్పొరేట్ జూనియర్ కళాశాలలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థిని మృతి చెందింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఒక కార్పొరేట్ కళాశాలలో పిఠాపురానికి చెందిన రామిశెట్టి గంగాభువనేశ్వరి(18) నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటోంది. మంగళవారం రాత్రి జ్వరంతో బాధపడుతూ జ్వరం తగ్గేందుకు టాబ్లెట్లు వేసుకుని నిద్రకు ఉపక్రమించింది. అర్ధరాత్రి రెండు మూడు గంటల మధ్య తీవ్రమైన తలనొప్పి రావడంతో తోటి విద్యార్థినులు సిక్ ఇన్‌చార్జికి తెలిపారు. మెరుగైన వైద్యం కోసం దగ్గరలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ విద్యార్థినిని పరీక్షించిన వైద్యులు మార్గం మధ్యలోనే మృతి చెందిందని తెలిపారు. దీంతో కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించింది. కళాశాల వద్దకు చేరుకున్న మృతురాలి తల్లి, బంధువులు తమ కుమార్తె మృతికి యాజమాన్యమే కారణమని ఆరోపించారు. కళాశాల యాజమాన్యం, పోలీసులు కారణాలు వెల్లడించాలని, తమ కుమార్తెకు ఎటువంటి అనారోగ్యం లేదని వాదించారు. కుమార్తె మృతి చెందిన వార్త విని తండ్రి గుండెపోటుకు గురైనట్లు విద్యార్థిని బంధువులు తెలిపారు. విద్యార్థిని మృతికి కారణాలు పోస్టుమార్టంలో తేలాల్సి ఉంది.

నిజాలు నిగ్గు తేల్చాలి: ఏబీవీపీ

లాంగ్ టర్మ్ కోసం కాకినాడ నుంచి విజయవాడ వచ్చిన విద్యార్థి మృతిచెందడం దారుణమని, తెలంగాణ తరహాలోనే రాష్ట్రంలోనూ కార్పొరేట్ కళాశాలలను కట్టడి చేయాలని, మహిళా కమిషన్, విద్యా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని ఏబీవీపీ నాయకుడు గోపీ డిమాండ్ చేశారు. కార్పొరేట్ మాయలో పడి తల్లిదండ్రులు విద్యార్థులను ఒకచోట బంధించి ఉంచి హాస్టళ్లలో బలిపశువులను చేస్తున్నారని, చనిపోయిన విద్యార్థిని కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

స్పందన శూన్యం!

» నగరంలో 2 లిక్కర్ మార్టులకు రెండు దరఖాస్తులే

» దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలతో బెంబేలు

» షాపు తెరవాలంటే రూ.5 కోట్లు పెట్టాల్సిందే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్ జిల్లాలో రెండు లిక్కర్ మార్టులకు ఇటీవల టెండర్లు పిలిచారు. ఈ రెండు మార్టుల కోసం కేవలం రెండు దరఖాస్తులే వచ్చాయి. దరఖాస్తు ఫీజు భారీగా ఉండటం, భారీగా పెట్టుబడి పెట్టాల్సి ఉండడమే దీనికి ప్రధాన కారణం. దరఖాస్తు ఫీజుగా రూ.15 లక్షలను నిర్ణయించి, రాష్ట్రవ్యాప్తంగా నగరాల్లోనే ఈ మార్టులను ఏర్పాటు చేసుకునేలా టెండర్లు పిలిచారు. వీటికి భారీ స్పందన ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారులు భావించారు. కానీ, విజయవాడలో రెండు మార్టులకు రెండే దరఖాస్తులు వచ్చాయి. 4వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో షాపు ఏర్పాటు చేయాలన్న నిబంధన కూడా వీటికి స్పందన కరువయ్యేలా చేసింది. నగరాల్లో అంత భారీగా స్థలం లభ్యం కావాలంటే రూ.50 లక్షలైనా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. టెండరు పాడుకున్న తర్వాత ఎక్సైజ్ శాఖకు రూ.కోటి డిపాజిట్ రూపంలో చెల్లించాలి. మార్ట్‌లో అన్నీ ప్రీమియం బ్రాండ్లు ఉంచితేనే కస్టమర్లను ఆకర్షించగలరు. అంతస్థాయిలో స్టాక్ ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం రూ.2.5 కోట్లు వెచ్చించాలి. ఇతరత్రా ఖర్చుల రూపేణా మరో కోటి వరకు అవుతుంది. మొత్తం మీద షాపు ప్రారంభించాలంటే రూ.5 కోట్లు పెట్టుబడి పెట్టాలి. ఇంత చేసినా కమిషన్ ఎంత అనేదానిపై సందిగ్ధత నెలకొంది. 20 శాతం కమిషన్ అని ప్రభుత్వం చెబుతున్నా, వివిధ పన్నులు, సెస్సులకు పోగా అందులో సగం కూడా గిట్టుబాటు కాదని మద్యం దుకాణదారులు చెబుతున్నారు. ఇటీవలే ప్రభుత్వం కమిషన్‌ను 14 శాతం గిట్టుబాటు అయ్యేలా చూస్తామని ప్రకటన చేసినా అది ఎప్పటి నుంచి అమలు అవుతుందనే ఆందోళన మద్యం వ్యాపారుల్లో ఉంది.

ఆంధ్రా లయోలా కళాశాలకు నోటీసులు

» నిబంధనల ఉల్లంఘనపై వివరణ కోరిన కృష్ణా యూనివర్సిటీ

మచిలీపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లంఘించిందని విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాలకు కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ శోభన్‌బాబు ఈనెల 7వతేదీన నోటీసులు జారీ చేశారు. ఇటీవల ముగ్గురు సభ్యులతో కూడిన బృందం లయోలా కళాశాలను పరిశీలించింది. పలు నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించింది. అటానమస్ హోదా ఉన్న లయోలా కళాశాల పలు నివేదికలను యూనివర్సిటీకి పంపకుండా జాప్యం చేసిందని, ఈ అంశంపై ఈనెల 9వతేదీ లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కళాశాల పరిపాలనాపరమైన అంశాలు, ఆర్థికపరమైన వ్యవహారాలు, గవర్నింగ్ బాడీ సమావేశాలు నిర్వహించకపోవడం, కళాశాల ప్రణాళికలు, జవాబుపత్రాల మూల్యాంకనం, పరీక్షల నిర్వహణ, నూతన కోర్సులను ప్రవేశపెట్టడం, అకడమిక్ కార్యక్రమాల వివరాలను తెలియజేయకుండా ఉంచారని పేర్కొన్నారు. కళాశాలకు అటానమస్ హోదా గడువు ముగిసినా పొడిగించకపోవడం, వివిధ కోర్సుల్లో అనుమతులు లేకుండా విద్యార్థులను చేర్చుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులు పెంచారని, ఈ విషయాలను యూనివర్సిటీకి తెలియజేయలేదని నోటీసులో పేర్కొన్నారు.

హోరాహోరీగా జాతీయ వాలీబాల్ పోటీలు

» సెమీస్‌కు తమిళనాడు, హరియాణ

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల గ్రౌండ్స్ వేదికగా నిర్వహిస్తున్న 68వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల వాలీబాల్ టోర్నీలో ప్రీ క్వార్టర్స్, క్వార్టర్స్ బుధవారం హోరాహోరీగా జరిగాయి. ఐదు సెట్ల పోరులో భాగంగా తొలి క్వార్టర్స్‌లో పశ్చిమబెంగాల్‌పై తమిళనాడు 3-1 సెట్ల తేడాతోను, ఉత్తర్‌ప్రదేశ్‌పై హరియాణ వరుస సెట్లలో ఏకపక్షంగా 3-0తో జయభేరి మోగించి సెమీస్ చేరాయి. పోటీల ఏర్పాట్లను రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తిరాజు, జిల్లా కార్యదర్శి వి.రవికాంత్, టెక్నికల్ కమిటీ ప్రతినిధి దోనేపూడి దయాకర్‌రావు, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మాజీరావు పర్యవేక్షిస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులతో రాత్రి ఉల్లాసపూరిత వాతావరణంలో క్యాంప్ ఫైర్ నిర్వహించారు.

200 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయిని పరిశీలిస్తున్న డీసీపీ, ఏసీపీ

నందిగామ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నందిగామ సబ్ డివిజన్ పరిధిలో జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామం వద్ద 80 కిలోలు, నందిగామలోని వై జంక్షన్ వద్ద ఇళ్ల ప్లాట్ల మధ్యన నిలిపి ఉంచిన కారులో 120 కిలోలు మొత్తం 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని విజయవాడ డీసీపీ మహేశ్వరరాజు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన పరిశీలించారు. విశాఖపట్నం నుంచి విజయవాడ, హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర తరలిస్తున్నారనే సమాచారంతో వాహనాలు తనిఖీ చేశామన్నారు. డ్రోన్, సీసీ కెమెరా, టెక్నాలజీ సాయంతో చాకచక్యంగా కార్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.25 లక్షల వరకు ఉంటుందని ఏసీపీ తిలక్ తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని కేసును దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సీఐలు వైవీఎల్ నాయుడు, చౌహాన్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

ముగిసిన ఒకేషనల్ విద్యార్థుల ఆన్ జాబ్ శిక్షణ

కూచిపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఆన్‌ది జాబ్ శిక్షణ తరగతుల కార్యక్రమం బుధవారంతో ముగిసింది. మొవ్వ పీఏసీఎస్, ఎండీవో కార్యాలయం, ఐసీడీఎస్ కార్యాలయాల్లో 31 రోజులపాటు విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాదశాస్త్రి మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అధ్యాపకులు రంగనాయకులు, గౌరమ్మ, ఆనంద్, విజయభేరీ, వాసుబాబు, ఆనందరావు పర్యవేక్షించారు.



ప్రిన్సిపాల్ ప్రసాద శాస్త్రితో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు



ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాలు

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

గుడివాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : ప్రతి నెల పెరుగుతున్న విద్యుత్ ట్రూఅప్ చార్జీలతో సామాన్యులు సతమతమవుతున్నారని, అదానీతో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క యూనిట్ కూడా వినియోగించని వ్యక్తికి రూ.236/-ల బిల్లు రావడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలను తక్షణమే రద్దు చేయకపోతే ప్రజాపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, చింతలూరి సత్యనారాయణ, కొమ్ముల సురేష్, లంకా సురేంద్ర, ఎ.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, పి.రజిని, కుమారి, త్రిమూర్తులు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యావికాస్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

గుడివాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యా వికాస్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు.విద్యార్థుల మాతృమూర్తులకు ముగ్గులు, సంప్రదాయ పిండివంటల పోటీలను నిర్వహించారు. వివిధ రకాల ఆకృతులతో చూపరులను మైమరిపించే రంగులతో రంగవల్లులను తీర్చిదిద్దారు. సంప్రదాయ పిండి వంటలు ఆరిసెలు, బూరెలు, రవ్వ లడ్డులు, జంతికలు, పులిహోర, గారెలను తయారు చేశారు. ముగ్గుల పోటీల్లో బి.కృష్ణవేణి, బి.గౌతమి, ఎం.నాగమణిలు, పిండివంటల పోటీల్లో ఎం.నాగమణి, ఎస్.హారిక, ఐ.అరుణలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ముప్పాళ్ళ సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ సాంబశివరావు



శేషవస్త్రాలు, పూలదండలను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఈవో గోపాలరావు

ఘనంగా ధనుర్మాస మహోత్సవాలు

గుడివాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహోత్సవాలు 50సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శ్రీవెల్లిపుత్తూరు నుంచి అండాలమ్మ వారికి శేషవస్త్రాలు, పూలదండలు, చిలక తీసుకుని మేళతాళాలతో గోవిందనామస్మరణతో, కోలాటాలు, నృత్యాలతో అంగరంగ వైభవంగా గొప్ప ఊరేగింపుతో దేవస్థానానికి తీసుకువచ్చారు. శ్రీగోదాదేవి అమ్మవారి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని శ్రీస్వామి, అమ్మవార్లకు ముత్యాల హారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ చలపాని ఇందిరారమణరావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన రంగవల్లుల పోటీలు

గుడివాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక షాగులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో దూళిపాళ శేషగిరి జ్ఞాపకార్థం కొడాలి విజయభారతి స్మారక రంగవల్లుల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 20మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా లయన్స్ క్లబ్ ఆఫ్ సంఘమిత్ర అధ్యక్షురాలు ఉప్పలపాటి ఝాన్సీరాణి, వాసవీ క్లబ్ వనిత విదర్భపురి అధ్యక్షురాలు చలువాది లక్ష్మీసురేఖలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ కన్వీనర్ డీఆర్బీ ప్రసాద్, వాసవీ క్లబ్ సభ్యులు గుడివాడ వాకర్స్ క్లబ్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు..



బహుమతులతో చిన్నారులు

సీపీఐ సీనియర్ నేత గూడపాటికి పరామర్శ

గుడివాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న సీపీఐ సీనియర్ నాయకులు గూడపాటి సువిశ్వేశ్వరరావును బుధవారం స్థానిక పెద ఎరుకపాడులోని ఆయన స్వగృహంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మోదుమూడి రామారావు, మహిళ సభ్యురాలు మోదుమూడి అరుణకుమారిలు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, సభ్యులు బేతపూడి సునీత, కంచర్ల మేరిమ్మ, పోట్ల సంతోషమ్మ, నిర్మలజ్యోతి, భవానిలు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్

జనసేనలో పలువురు చేరిక

గుడివాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : నందివాడ మండలానికి చెందిన బెజ్జవరపు ప్రసాద్, నాగమణి, సానా ప్రసాద్‌ల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ సమక్షంలో సుమారు 50మంది జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, బుడమ రాజు, గుండు వెంకట్రావు, వై.శ్రీనివాసరావు, షరీఫ్, నరసయ్య, వెంకటేష్, భాను, తోట వెంకటేష్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఉత్తీర్ణత నూరుశాతం ఉండాలి

జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు

గుడివాడ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుడివాడ డివిజన్‌లో 10వ తరగతి ఉత్తీర్ణత నూరుశాతం ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గుడివాడ డివిజన్‌లోని 7 మండలాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపై అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన డీసీఈబీ తయారు చేసిన మెటీరియల్‌ను విద్యార్థులతో పఠనం చేయించాలని కోరారు. వంద రోజుల ప్రణాళికను అందరూ అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతీ రోజు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు పదవ తరగతి విద్యార్థులకు ఒక క్రమ పద్ధతిలో బోధించాలన్నారు. మండల స్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి ఖచ్చితంగా నూరుశాతం వచ్చే విధంగా చూడాలన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి ఐ.పద్మారాణి మాట్లాడుతూ సబ్జెక్టుల వారీగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్తీర్ణతశాతం పెరగటానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎంఈవో విజయకుమార్, బాలాజీ, ఏరియా కో-ఆర్డినేటర్ జాని సాహెబ్, గుడివాడ, నందివాడ, పెదపారుపూడి, ఉంగుటూరు, గుడ్లవల్లేరు, గన్నవరం తదితర మండలాల ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఎంపీడీవో సీతామహాలక్ష్మి



పెదపారుపూడి జడ్పీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

పెదపారుపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పెదపారుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోరి వికాసం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నైపుణ్య, ఉపాధి, లింగ వివక్ష, రక్తహీనత, బాల్య వివాహాలు నియంత్రణ, బాలికల అక్రమ రవాణా, లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. తదుపరి బాల్య వివాహ నియంత్రణ గురించి ప్రతిజ్ఞ చేయించారు. యలమర్రు, వెంట్రప్రగడ, వానపాముల, దోసపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్‌లు అరుణకుమారి, శివనాగమణి, హెచ్‌ఎంలు, టీచర్లు ఎంఎస్‌కె. నాగలక్ష్మి, వెల్ఫేర్, విద్య సహాయకులు, ఏఎన్‌ఎంలు, భూషణగుళ్ళ, గురువిందగుంట గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పామర్రు : బాల్యవివాహాల నిర్మూలనకు సమాజంలో అందరూ తమ వంతు బాధ్యతగా తీసుకోవాలని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెదమద్దాలి, జమీగోల్వేపల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థులకు కిశోరి వికాసం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శి పాల్గొన్నారు.



దొండపాడులో మినుము పొలం పరిశీలిస్తున్న అధికారులు

కలుపు నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

గుడివాడ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మినుము పంటలో రైతులు కలుపు నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ విస్తరణాధికారి వి.అనిత కోరారు. కూలీల చేత కలుపు తీయించాలని ఎక్కువగా ఉన్నట్లైతే ఇమాధితాపిర్ 200 మిల్లీలీటర్లతో ఎకరానికి పిచికారి చేయాలన్నారు. బంగారు తీగ మొక్కలను వేళ్లతో తీసి వేసి బయట కాల్చివేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భవాని, నాగవరప్పాడు, దొండపాడు రైతులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులు

విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు

గుడివాడ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్, అర్బన్ మండలాల్లో 3, 4, 5 తరగతులు చదివే విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీ పరీక్షలు నిర్వహించారు. కొంతమంది విద్యార్థులు మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వీరికి జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అభినందనలు తెలిపి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో ఐ.పద్మావతి, ఎంఈవోలు విజయ్ కుమార్, బాలాజీ, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి

వెంట్రప్రగడ రెవెన్యూ సదస్సులో 30 అర్జీలు

పెదపారుపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వెంట్రప్రగడ గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ వై.రంగారావుతో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ రైతులకు పాస్ పుస్తకం, అడంగల్‌లో కానీ ఏమన్నా మార్పులు లేక, పొలంలో తప్పులు నమోదు అవ్వటం తదితర సమస్యలు ఉంటే ఈ రెవెన్యూ సదస్సు ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలియజేశారు. ప్రజల నుంచి 30 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెదపూడి జగనన్న కాలనీలో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెదపూడి జగనన్న కాలనీ స్థితిగతులపై విజిలెన్స్ అధికారుల వివరాల సేకరణ

కూచిపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం పెదపూడిలో జగనన్న కాలనీ స్థితిగతులను విజిలెన్స్ శాఖాధికారులు పరిశీలించి వివరాలు సేకరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీకి విక్రయించిన భూములకు సంబంధించిన పలు విషయాలపై రైతులను అడిగి 5.75 ఎకరాలకు సంబంధించిన వివరాలు సేకరించారు. భూమి అమ్మిన రైతులు పులిగడ్డ ప్రసాద్, దగాని వెంకటేశ్వరరావు, దగాని రాధాకృష్ణలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాలనీలో మౌలిక వసతులపైన ఆరా తీశారు. గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ వంశీ, వీఆర్వో రాజేంద్ర ప్రసాద్, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



భద్రిరాజుపాలెం పంచాయతీ కార్యాలయంలో ఫీల్డు అసిస్టెంట్ కిరణ్‌ని విచారిస్తున్న ఎంపీడీవో రవికాంత్

సర్పంచ్‌ని నిర్లక్ష్యం చేయటం తగదు

ఎంపీడీవో కేఎస్ రవికాంత్

తోట్లవల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనుల్లో గ్రామ సర్పంచ్‌ని నిర్లక్ష్యం చేయకూడదని, సర్పంచ్ సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని పనులు నిర్వహించాలని ఎంపీడీవో కేఎస్ రవికాంత్ ఫీల్డు అసిస్టెంట్ కిరణ్‌కు సూచించారు. ఉపాధిహామీ గ్రామసభలు తాను లేకుండానే నిర్వహించి తన సంతకం లేకుండానే పనులను ఆమోదించి అవమానానికి గురిచేస్తున్నారని భద్రిరాజుపాలెం సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో భద్రిరాజుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధిహామీ పనుల వివాదంపై బుధవారం ఎంపీడీవో రవికాంత్, ఉపాధిహామీ ఏపీవో జి కిరణ్, ఇన్‌చార్జి కార్యదర్శి డి. తావిర్యా పూర్వపు ఇన్‌చార్జి కార్యదర్శి పి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఫీల్డు అసిస్టెంట్ కిరణ్‌ను విచారించారు. సెప్టెంబరు 23న పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధిహామీ గ్రామసభ రిజస్టర్ తనిఖీ చేయగా అందులో సర్పంచ్ సంతకం లేని అంశాన్ని గుర్తించారు. సర్పంచ్ గ్రామసభకు రాలేదని అందుచేత సంతకం తీసుకోలేదని కిరణ్ తెలిపారు. తనకు ఏ విషయం తెలియనీయటం లేదని సర్పంచ్ చెప్పారు. ఇకనుంచి పద్ధతి మార్చుకోవాలని, సర్పంచ్‌ని గౌరవించాలని ఎంపీడీవో రవికాంత్ సూచించి పనులు ఆమోదించిన రిజస్టర్‌లో సర్పంచ్ సంతకం చేయించారు.

శేషు మృతి తీరని లోటు : సీపీఎం

గుడివాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : మోపిదేవి ప్రాంతంలో ప్రజాఉద్యమాలలో కీలకపాత్ర పోషించిన పార్టీ హోల్‌టైమర్ బండి శేషు ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.మురళీకృష్ణారెడ్డి అన్నారు. శేషు మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, కొమ్ముల సురేష్, గానుగుల త్రిమూర్తులు, యలమర్తి కోటేశ్వరరావు, టీజే ప్రకాష్, లంకా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పామర్రు అస్సెసీ స్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న కుమార్‌రాజా

అనాథ పిల్లలను ఆదుకోండి

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్న అనాథ పిల్లలను గుర్తించి వారిని ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఓ సామాజిక బాధ్యతగా తీసుకుని మరింతగా వారి అభివృద్ధికి సహకరించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపునిచ్చారు. స్థానిక అస్సెసీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో బుధవారం జరిగిన అనాథ పిల్లల దినోత్సం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన 18మంది అనాథ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచారు. వారికి ఎమ్మెల్యే రూ.ఐదువేలు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, జిల్లా డెల్టా ప్రాజెక్టు వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, పాఠశాల ప్రిన్సిపాల్ తదితర్లు పాల్గొన్నారు.

చేతిరాతను నిత్యం సాధన చేయాలి

జాతీయ చేతిరాత అకాడమీ నిర్వాహకులు డాక్టర్ మల్లికార్జునరావు

గుడ్లవల్లేరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చేతిరాతను నిత్యం సాధన చేయగల్గితే మంచి చేతిరాత అలవరడమే కాక మంచి భవిష్యత్‌కు అది దోహదపడుతుందని హైదరాబాద్‌కు చెందిన జాతీయ చేతిరాత అకాడమీ నిర్వాహకులు డాక్టర్ వై.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న చేతిరాత మెరుగు పరిచే మెళకువలపై ఆయన శిక్షణ తరగతులు నిర్వహించారు. చివరి రోజు బుధవారం ముగింపు కార్యక్రమంలో ఆయనను హైస్కూల్ మేనేజ్‌మెంట్ సన్మానించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల అప్సా డెమోక్రటిక్ గుడివాడ శాఖ నిర్వహించిన క్రీడా పోటీల్లో 33 అంశాల్లో పాల్గొని 136 బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీలు పి.భూపాల్‌రెడ్డి, రాధలను ఎంవీజీ ఆంజనేయులు, అర్జా ప్రసాద్, ప్రిన్సిపాల్ సాతులూరి లీనా, వైస్ ప్రిన్సిపాల్ జి.సత్యబాబు, వై.మలిఖార్జునరావు, హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస మూర్తిలు అభినందించారు.

ఉల్లాసంగా ఫ్రెషర్స్ డే

వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఫ్రెషర్స్ డే లో జూనియర్, సీనియర్లు పరస్పరం పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ఎస్‌కె అమీనాబీ, పి.రవీష, టి.ప్రశాంతి, టి.బాలకృష్ణ, బి.సత్యశ్రీ, వి.ఎల్ వినోద్, శ్రావణి, ఎ.సాయి దాత్రి, పరిమళ, రజని తదితరులు పాల్గొన్నారు.

శ్రీఆదిత్య విద్యార్థులకు ఉద్యోగాలు

గుడివాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన మిలెకాల్ కంపెనీ, టీసీఎస్‌లు జరిపిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాల విద్యార్థి బోడావుల అశ్విని మిలెకల్ కంపెనీకు రూ.5.5లక్షల వార్షిక వేతనం, మరో 11మంది విద్యార్థులు టీసీఎస్ కంపెనీకు రూ.2.20 లక్షల వార్షిక వేతనాలతో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు తెలిపారు. బుధవారం స్థానిక గౌరీశంకరపురంలోని కళాశాలలో విద్యార్థులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, అధ్యాపకులు, ఏవో బాలాజీ, విద్యార్థులు అభినందించారు.



ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.505

వృద్ధాశ్రమంలో సరుకుల పంపిణీ



సరుకులు అందిస్తున్న రాము

చల్లపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ మండలం అశ్వారావు పాలెం సచివాలయ కార్యదర్శి దీవి పద్మావతి - మాదివాడ రాము దంపతులు సీయోను వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. వృద్ధులకు రోజువారీ అల్పాహారం, భోజనం తయారుచేసేందుకు వీలుగా బియ్యం, కూరగాయలు, సరుకులను ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావుకు అందించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చల్లపల్లి సబ్‌బ్రాంచ్ చైర్మన్ లీలాబ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

ఇరిగేషన్ సమావేశం నేడు

నాగాయలంక: మర్రిపాలెంలోని ఇరిగేషన్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు కొత్తగా ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఈ పి.రవితేజ తెలిపారు. ఈ సమావేశానికి డిఈఈ హాజరవుతారు. నీటి సంఘాల అధ్యక్షులు రావాలని ఆయన కోరారు.

లంకెకు మండలి పరామర్శ

కోడూరు: సాలెంపాలెం ఎంపీటీసీ సభ్యుడు లంకే భాస్కరరావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షురాలు లంకే కృష్ణకుమారి దంపతులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. ఇటీవల భాస్కరరావు మాతృమూర్తి ప్రభావతి మృతి చెందగా, ఆమె మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం, కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, నీటి సంఘం ఉపాధ్యక్షులు మోకా యానాదిరావు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవరచుకోవాలి

• ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు



జ్యోతి వెలిగించిన కొనకళ్ళ నారాయణరావు, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



సభలో మాట్లాడుతున్న కొనకళ్ళ నారాయణరావు

మచిలీపట్నం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవరచుకునేందుకు వీర్నాల ఫౌండేషన్ నిర్వహిస్తున్న పోటీలు దోహదపడతాయని మాజీ ఎంపీ, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. హిందూ కళాశాలలో బుధవారం ప్రారంభమైన మూడు రోజుల పాటు నిర్వహించే వివిధ పోటీలను కొనకళ్ల, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్‌కే విద్యాసంస్థల అధినేత బండి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తులను వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఫౌండేషన్ చైర్మన్ వీర్నాల బాలాజీ మాట్లాడుతూ, పోటీల్లో 5500 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో డీవైఈవో శేఖర్‌సింగ్, హిందూ కళాశాల అనుబంధ సంస్థల కార్యదర్శి డీజీ శాస్త్రి, వీర్నాల నాంచారయ్య, మానస, పోతురాజు, శేఖర్ పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన మాజేరు టీమ్

ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం హిందూ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ పోటీలకు మంచి స్పందన లభించింది. మాజేరు జిల్లా పరిషత్ హైస్కూల్ జట్టు, నూజివీడు జిల్లా పరిషత్ హైస్కూల్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో మాజేరు జట్టు, నూజివీడు జట్టుపై విజయం సాధించింది. కోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్ జట్టుతో మచిలీపట్నం చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్ జట్ల మధ్య గట్టి పోటీ జరిగింది. ఈ పోటీలో కోసూరు జట్టు 2 పాయింట్ల ఆధిక్యతతో విజయం సాధించింది.



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డా. శర్మిష్ఠ

క్యాలెండర్ ఆవిష్కరణ

అవనిగడ్డ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం -2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు జి.గోపిచంద్ ఆధ్వర్యంలో బుధవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలశారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సాయిబాబు, ట్రెజరర్ కె.నవీన్, జిల్లా జాయింట్ సెక్రటరీ వేమూరి లావణ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్ కుమార్, చల్లపల్లి మండల నాయకులు పాల్గొన్నారు.

మచిలీపట్నం టౌన్ : ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్‌ను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శర్మిష్ఠ ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షురాలు కర్రా కవిత, జి. సుధారాణి, పి.మాధవి, రాజ్యలక్ష్మి, నాగలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెడన కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు

• కలెక్టర్ బాలాజీతో సమీక్షించిన పెడన ఎమ్మెల్యే కాగిత



మాట్లాడుతున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

మచిలీపట్నం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెడనలో కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పెడన కలంకారీ ఆర్టిజాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధిలతో బుధవారం కలెక్టర్ క్లస్టర్ ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెడనలో ఆర్టిజన్ క్లస్టర్ ఏర్పాటుకు కావాల్సిన ప్రభుత్వ భూమిని ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు ఆర్.వెంకట్రామన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పెడన కలంకారీ ఆర్టిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.ప్రసాద్, కార్యదర్శి జంపాల శ్రీనివాస్, అడ్వైజర్ రవి, తహసీల్దార్ అనిల్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే పీడీ చట్టం నమోదు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ భార్గవ

పెడన, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సారా తయారు చేసినా, విక్రయించినా పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.భార్గవ హెచ్చరించారు. సారా రహిత రాష్ట్రంగా మార్చాలన్న ఆశయంతో ప్రభుత్వం చేపట్టిన నవోదయం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో భార్గవ మాట్లాడుతూ, సారాతో సంబంధం ఉన్న వారిని సమాజం చిన్నచూపు చూస్తుందన్నారు. దక్షిణతెలుగుపాలెం ప్రజలు సారాకు దూరంగా ఉండి గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. సీఐ పి.వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ, సారా నిర్మూలనకు గ్రామ, మండల, నియోజకవర్గస్థాయిలలో కమిటీలు వేస్తున్నామన్నారు. ఈ కమిటీలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తమకు అందజేస్తాయని, వాటి ఆధారంగా దాడులు నిర్వహిస్తామన్నారు. సారా తయారీకి స్థలాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తాను దత్తత తీసుకున్న దక్షిణతెలుగుపాలెం ప్రజలు సారా జోలికి పోకుండా నిరంతరం పర్యవేక్షిస్తుంటానన్నారు. కౌన్సిలర్ సిరివెళ్ళ జయేష్, ఎక్సైజ్ ఎస్సై రవి, వీఆర్వో నాగరాజు పాల్గొన్నారు.



మధ్యాహ్నభోజనాన్ని రుచి చూస్తున్న విజయ్‌కుమార్

మధ్యాహ్న భోజనం పరిశీలన

అవనిగడ్డ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించటానికి బాల్యం నుంచే కృషి చేయాలని పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ అన్నారు. పులిగడ్డ ప్రాథమిక పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు పురోగమించాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఈవో అనిత పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఆదిశేషు మృతి బలహీన వర్గాలకు నష్టం

మోపిదేవి: సీపీఎం మండల కార్యదర్శి బండి ఆదిశేషు అకాల మరణం బడుగు, బలహీనవర్గాల ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం రాత్రి అనారోగ్యంతో మోపిదేవిలో ఆయన స్వగృహంలో మృతి చెందాడు. సీపీఎం, జనసేన, టీడీపీ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వైె.నరసింహారావు, వెంకటేశ్వరరావు, మాగంటి హరిబాబు, యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, శీలం నారాయణరావు సంతాపం తెలిపారు.

కోడూరులో కాపు సంక్షేమ భవనం నిర్మించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కోడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో కాపు సంక్షేమ భవనం నిర్మాణం చేపట్టాలని కాపు సంఘ నేత, జనసేన నాయకులు బడే వెంకటేశ్వరరావు బుధవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బుద్ధప్రసాద్ కాపు సంక్షేమ భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించి, కోడూరు సెంటర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించారన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను నిర్వీర్యం చేసి కాపు సంక్షేమ భవనాన్ని నిర్మించలేదన్నారు. గతంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ప్రదేశంలోనే కాపు సంక్షేమ భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోట రంగరాజు పెరుమాళ్ల, బడే మధు,నారాయణరావు, బండే గోపాలకృష్ణ, వర్థినీడు వెంకటేశ్వరరావు, కూనప రెడ్డి లక్ష్మణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అనర్హుల పింఛన్ల తొలగింపునకు చర్యలు



వ్యాధి గ్రస్తుల స్థితిని పరిశీలిస్తున్న డా. శ్రీకాంత్

పెడన, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రూ. 15వేల పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులను ప్రభుత్వ వైద్యులు బుధవారం తనిఖీ చేశారు. పట్టణంలో కిడ్నీ, క్యాన్సర్ తదితర వ్యాధుల బారినపడి మం చానికే పరిమితమయ్యారన్న కారణంగా పట్టణ పరిధిలోని 25 మంది రూ.15వేల చొప్పున పెన్షన్ పొందుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అనర్హులకు పెన్షన్లు ఇచ్చారన్న ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు శ్రీకాంత్, పూర్ణిమ, సాయి ప్రీతి బుధవారం పట్టణ పరిధిలో రూ. 15వేల పెన్షన్ తీసుకుంటున్న 25మంది ఇళ్లకు వెళ్ళి తనిఖీలు నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరరావు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

గోదాదేవికి పిండి దీపాలు

అవనిగడ్డ: గీతా మందిరంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా బుధవారం గోదాదేవికి పిండి దీపాలను సమర్పించారు. అంతకు ముందు అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, అలంకారం నిర్వహించారు. భక్తులు సామూహికంగా అమ్మవారికి కుంకుమ పూజలు, సువర్ణ పుష్పాలతో పూజలు చేశారు.



మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి

కోడిపందేలు, జూదాలను కట్టడి చేయండి : ఆర్డీవో

మచిలీపట్నంటౌన్ : సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో జూదాలు, బెట్టింగ్‌లతో వేసే కోడిపందేలను అరికట్టాలని బందరు ఆర్డీవో కె.స్వాతి ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో బుధవారం వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ, పశుసంవర్ధక శాఖ, పోలీసు శాఖల అధికారులను కో ఆర్డినేట్ చేసుకుంటూ కోడి పందేలు, జూదం ఆడకుండా నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదనరావు పాల్గొన్నారు.

13 నుంచి ముగ్గుల పోటీలు



పోస్టర్ విడుదల చేస్తున్న స్వామి

గూడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా ఈనెల 13,14,15 తేదీల్లో గూడూరు గాంధీబొమ్మ సెంటర్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీసీ చైర్మన్ పోతన స్వామి తెలిపారు. మహిళలు, యువతకు ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్, స్లో సైక్లింగ్, పిల్లలకు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు, యువత ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మాజీ సర్పంచ్‌లు రామోజీ, వేణుగోపాలరావు, రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి ఎస్‌ఏ బేగ్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కోలపల్లి రజని పాల్గొన్నారు.

వలందపాలెంలో రేషన్‌షాపులో తనిఖీలు



తనిఖీ చేసిన సివిల్ సప్లైస్ డిటి సుభాన్‌బి

మచిలీపట్నం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వలందపాలెంలో 31వ నెంబరు షాపును బుధవారం సివిల్ సప్లైస్ అధికారులు దాడులు చేశారు. డీఎస్‌వో పార్వతి, సివిల్ సప్లైస్ డీటీ సుభాన్‌బీ, వీఆర్వో కిషోర్ దాడి చేశారు. 50 కిలోల కంది పప్పు అదనంగా ఉన్నట్టు గుర్తించారు. కంది పప్పుపై అధికారులు విచారించగా ఈ కంది పప్పు తనదికాదని, ఎండీయూకు చెందిందని రేషన్ షాపు డీలరు గవర్రాజు చెప్పాడు. దీంతో అధికారులు రేషన్‌షాపు డీలర్‌తో పాటు ఎండీయూ శివశంకర్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. షాపును సీజ్ చేశారు. పక్కన ఉన్న 28వ షాపుకు అప్పగించారు.



విరాళాన్ని అందజేస్తున్న ఆంజనేయులు కుటుంబసభ్యులు

రూ.లక్ష విరాళం

కోడూరు. జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోడూరులో పునర్నిర్మాణం చేపట్టిన శివరామకృష్ణ క్షేత్రానికి శ్రీదాన శక్తి ధర్మసంస్థాన్ చైర్మన్ అన్నం ఆంజనేయులు కుటుంబసభ్యులు రూ.1,01,116లు విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆంజనేయులుకు బుధవారం విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బడే భావన్నారాయణ, జూహూడి సుభాష్ చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణ ప్రయోజనకరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మండలి

అవనిగడ్డ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తులో ఎంచుకునే రంగాల్లో నాయకులుగా ఎదిగేందుకు వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగుతలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. లంకపల్లిలోని సత్య సేవ యోగా మండలి ఆధ్వర్యంలో 6, 7, 8, 9 తరగతుల బాలబాలికలకు వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ నెల 10 నుంచి ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు ఈ శిక్షణ నిర్వహిస్తారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యం కోసం, ఆరోగ్యవంతమైన సమాజం కోసం శ్రీనివాస్ గురూజీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

విద్యుత్‌శాఖ విజిలెన్స్ తనిఖీలు

కోడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోడూరులో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలపై విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ సి.హెచ్.వాసు, ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో 29 బృందాలు బుధవారం 1945 గృహాలు, 2024 వాణిజ్య సముదాయాలు తనిఖీ చేశారు. అందులో 336 సర్వీసులు అదనపు లోడు వాడుతున్నట్లు గుర్తించి, రూ.8.90 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. అవనిగడ్డ, చల్లపల్లి, ఉయ్యూరు డీఈఈలు ఎన్.సుబ్రహ్మణ్యం, పి.శివనాగేశ్వరరావు, జి.హేమకుమార్, విద్యుత్ శాఖ ఏఈలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా



టీడీపీ సభ్యత్వాలను అందిస్తున్న రాంబాబు

చల్లపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పిస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు అన్నారు. ఇస్లాం నగర్‌లో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా చేయించటం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ నబీమోరి, వార్డుసభ్యుడు షేక్ సిలార్, కారంకి సతీష్, కారంకి ఫణికుమార్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రేవతి

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

ఘంటసాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మల్లాయిచిట్టూరులో నూతనంగా నిర్మించే రెండు సీసీ రహదారుల నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ చేసి పనులను సర్పంచ్ ఆవుల రేవతి, నీటి సంఘం అధ్యక్షుడు ఆవుల ధర్మవెంకట నరసయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మవెంకట నరసయ్య మాట్లాడుతూ రూ.10 లక్షలతో రెండు సీసీ రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగబాబు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

పురోహితుల సమస్యలపై అవగాహనా సదస్సు



మాట్లాడుతున్న వేమూరి ఆనందసూర్య

మచిలీపట్నం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ లబ్బీపేటలోని కంచికామకోటి పీఠం వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఈనెల 20న బ్రాహ్మణ అర్చక, పురోహితుల సమస్యలపై సదస్సు నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూర్య తెలిపారు. శిడింబి అగ్రహారంలో బుధవారం రాష్ట్రీయ బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు వేమూరి రామకృష్ణారావు ఇంటి వద్ద జరిగిన సమావేశంలో ఆనందసూర్య మాట్లాడారు. అర్చకులు, పురోహితులకు అందవలసిన సంక్షేమ పథకాలపై సదస్సులో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఆహ్వాన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బులుగు కిరణ్‌కుమార్, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ప్రతినిధులు పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.